https://epaper.dksaardyamlochaatimpu.com

E-mail: dkchaatimpu80@gmail.com RNI. NO. APTEL/2008/26737



డీకే సారథ్యంలో

చాటింపు

తెలంగాణ దిన పత్రిక

హైదరాబాద్ సంపుటి : 18 సంచిక : 30 ఎడిటర్ : పూసాల శ్రీనివాస్ గురువారం,అక్టోబర్,29, 2026 పేజీలు : 8 వెల : రూ.1/-

తాగునీటి వృథాకు చెక్..

రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం

- ప్రభుత్వ కార్యాలయాలు, పార్కుల్లో ట్రీటెడ్ వాటర్ తప్పనిసరి- ఎస్టీపీల పర్యవేక్షణకు ఏఐ టెక్నాలజీ.. హైడ్రా నిఘా-భవన నిర్మాణ అనుమతుల్లో కొత్త నిబంధనలు.. ట్యాంకర్ల ట్రాకింగ్



రోడ్డుతో పాటు వివిధ ప్రాంతాల్లోని ల్యాండ్‌స్కేప్‌లు, రోడ్ల క్లీనింగ్‌కు కేవలం ట్రీటెడ్ వాటర్‌ను మాత్రమే ఉపయోగించాలని స్పష్టం చేశారు. సచివాలయం, సీఎం కార్యాలయ ల్యాండ్‌స్కేప్‌లతో పాటు ప్రభుత్వ పబ్లిక్ పార్కుల్లోనూ ఇదే నీటిని వాడాలి. రైల్వే శాఖ, మెట్రో రైల్ విభాగాలను కూడా ఈ పరిధిలోకి తీసుకురావాలని, ప్రభుత్వ కార్యాలయాల్లో ఇతర అవసరాల కోసం వంద శాతం ట్రీటెడ్ వాటర్‌ను వాడటాన్ని తప్పనిసరి చేస్తూ తక్షణమే ఉత్తర్వులు జారీ చేయాలని ఆదేశించారు. ట్రీటెడ్ వాటర్ వినియోగాన్ని మరింత విస్తృతం చేసేందుకు భవన నిర్మాణ అనుమతులు (బిల్డింగ్ పర్మిషన్స్) మంజూరు చేసే సమయంలోనే ఈ నీటిని వాడాలనే నిబంధన విధించాలని సీఎం సూచించారు.

హైదరాబాద్,అక్టోబర్,28: రాష్ట్రంలో భవిష్యత్ నీటి ఎద్దడిని నివారించేందుకు , తాగునీటి వృధాను అరికట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం అత్యంత కీలక నిర్ణయం తీసుకుంది. ఎస్టీపీలు (మురుగునీటి శుద్ధి కేంద్రాలు), ట్రీటెడ్ వాటర్ వినియోగంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జల వనరుల పరిరక్షణ, ట్రీటెడ్ వాటర్ వినియోగంపై పలు కఠిన మార్గదర్శకాలను జారీ చేశారు. నవంబర్ 1 నుంచి డిసెంబర్ నాటికి ఈ ఆదేశాలన్నీ క్షేత్రస్థాయిలో కచ్చితంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మంచి నీటి సమస్య తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, పర్యవేక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం వహించొద్దని హెచ్చరించారు. ట్రీటెడ్ వాటర్ శుద్ధి ప్రక్రియలో నాణ్యతపై ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడొద్దని సీఎం రేవంత్ రెడ్డి తేల్చిచెప్పేశారు. ట్రీటెడ్ వాటర్ ప్లాంట్లలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీని విధిగా వినియోగించాలని ఆదేశించారు. ప్రతి ప్లాంట్ దగ్గర ఒక ప్రత్యేక అధికారిని నియమించడంతో పాటు, అన్ని ప్లాంట్లను సమర్థవంతమైన పర్యవేక్షణ కోసం కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానించాలని సూచించారు. అంతేకాకుండా ఈ ప్లాంట్ల నిర్వహణపై హైడ్రా మానిటరింగ్ ఉండాలని స్పష్టం చేశారు. ప్లాంట్ల నిర్వహణ వ్యయాన్ని తగ్గించేలా సోలార్ పవర్‌తో వాటిని నడిపే అవకాశాలను కూడా పరిశీలించాలని అధికారులను కోరారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని తాగునీటిని కేవలం తాగునీటి అవసరాలకే పరిమితం చేయాలని సీఎం ఆదేశించారు. ఔటర్ రింగ్

నర్సాపురం వద్ద

తీరం దాటిన అర్నబ్ తుపాను

- కూలిన చెట్లు, స్తంభాలు.. ఎక్కడ చూసినా జలవిలయం
- ఉత్తరాంధ్ర జిల్లాల్లో రికార్డు స్థాయిలో కుండపోత వర్షాలు
- గుంటూరు, కృష్ణా, గోదావరి జిల్లాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయం
- కూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలతో తీవ్ర అంతరాయం, పంటలకు నష్టం
- పరిస్థితిపై సీఎం చంద్రబాబు సమీక్ష, సహాయక చర్యలు ముమ్మరం



అమరావతి,అక్టోబర్,28: అర్నబ్ తుపాను ఆంధ్రప్రదేశ్ కోస్తా తీరాన్ని అతలాకుతలం చేస్తోంది. పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం సమీపంలో తీరం దాటిన ఈ తుపాను ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాలు చిగురుటాకులా వణికిపోతున్నాయి. భారీ నుంచి అతి భారీ వర్షాలు, ప్రచండ గాలులతో జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. ముఖ్యంగా ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాలపై తుపాను తీవ్ర ప్రభావం చూపుతోంది. లోతట్టు ప్రాంతాలు జలమయమవ్వగా, రహదారులన్నీ నదులను తలపిస్తున్నాయి. వేలాది ఎకరాల్లో పంటలు నీట మునిగి రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. విజయనగరం జిల్లా గరివిడిలో రాష్ట్రంలోనే అత్యధికంగా 26 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. అనకాపల్లి, శృంగవరపుకోట, వేపాడ, చీపురుపల్లిలో 25 సెం.మీ., భీమునిపట్నం, ఎలమంచిలి, మెంటాడలో 24 సెం.మీ. చొప్పున వర్షం కురిసింది. విశాఖపట్నం, విజయనగరం పట్టణంలో 21-22 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. విజయనగరం జిల్లాలో సువర్ణముఖి, గోస్తనీ, చంపావతి నదులు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో సమీప గ్రామాలు నీట మునిగాయి. సాలూరు బస్టాండ్ పూర్తిగా నీటిలో చిక్కుకుంది. బలమైన ఈదురుగాలులకు భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. కోతకు సిద్ధంగా ఉన్నవరి పంట నీట మున గడంతో రైతులు కన్నీరుమున్నీరవుతు న్నారు. భూపతిపాలెం, వట్టిగెడ్డ వంటి జలాశయాలు నిండుకుండలా మారాయి. కృష్ణా, గుంటూరు జిల్లాలను సైతం భారీ వర్షాలు ముంచెత్తాయి. గుంటూరు నగరంలోని గుజ్జనగుండ్ల-కొరిటపాడు రహదారి మోకాళ్ల లోతు నీటిలో మునిగిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నగరం లోని బీఆర్ స్టేడియం చెరువును తలపించగా, ఎన్టీఆర్ ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం, పీవీకే నాయుడు కూరగాయల మార్కెట్ నీటిలో చిక్కుకున్నా యి. బాపట్లలో 8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. వేమూ రు నియోజకవర్గంలో పంట పొలాలు పూర్తిగా నీట మునిగాయి. కృష్ణా జిల్లాలోని మచిలీపట్నంతో సహా పలు లోతట్టు ప్రాంతాల్లోకి వరద నీరు చేరడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. నాగాయ లంక వద్ద కృష్ణానదిలో అలల ఉద్ధృతి పెరిగింది. తుపాను పరిస్థితిపై ముఖ్యమ ంత్రి చంద్రబాబు ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు.

విద్వేషాన్ని వ్యాప్తి చేయకండి..

రాహుల్ గాంధీపై నిర్మలా సీతారామన్ ఆగ్రహం



న్యూఢిల్లీ,అక్టోబర్,28: టాటా గ్రూప్‌పై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తీవ్రంగా స్పందించారు.
విద్వేషాన్ని వ్యాప్తి చేయొద్దని రాహుల్ గాంధీకి హితవు పలికారు. టాటా సంస్థకు సంబంధించిన వివాదంపై రాహుల్ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి. టాటా గ్రూప్‌లో చోటుచేసుకున్న పరిణామాలపై రాహుల్ గాంధీ విమర్శలు చేశారు వ్యాపారవేత్తలు తమ అభిప్రాయాలను బహిరంగంగా వెల్లడించాలని, భారతీయ వ్యాపార సంస్థలు రాజకీయ నాయకుల చేతుల్లో ఆటవస్తువులుగా మారకూడదని వ్యాఖ్యానించారు. 'టాటా గ్రూప్‌ను ఉద్దేశపూర్వకంగా నాశనం చేస్తున్నారు. భారత వ్యాపారం మోదీ, షాల ఆటవస్తువు కాదు. మీకు ధైర్యం లేదు. మాకు ఉంది. మేము న్యాయం జరిగేలా చూస్తాము' అని రాహుల్ పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలపై నిర్మలా సీతారామన్ అభ్యంతరం వ్యక్తం చేస్తూ రాహుల్ గాంధీ తీరును తప్పుబట్టారు. రాజకీయ విమర్శలు చేసే సమయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు

లంచం తీసుకుంటూ ఏసీబీకి

రెడ్ హ్యాండెడ్‌గా చిక్కిన బంజారాహిల్స్ ఎస్ఐ

ఎస్ఐ విజయ్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్న అధికారులు



హైదరాబాద్,అక్టోబర్,28: హైదరాబాద్ నగరంలోని బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఓ సబ్-ఇన్‌స్పెక్టర్ లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయాడు. ఓ కేసులో సహాయం చేసేందుకు ఫిర్యాదుదారుడి నుంచి రూ. 10 లక్షలు డిమాండ్ చేసినట్లు ఆయనపై ఆరోపణలు ఉన్నాయి. వివరాల్లోకి వెళితే.. బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేస్తున్న విజయ్, ఓ ఫిర్యాదుదారుడి నుంచి రూ. 10 లక్షలు లంచం డిమాండ్ చేశాడు. దీనిపై బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. ముందుగా వేసుకున్న పథకం ప్రకారం, బుధవారం ఫిర్యాదుదారుడి నుంచి రూ.లక్ష లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు ఎస్ఐ విజయ్‌ను పట్టుకున్నారు. పోలీస్ స్టేషన్‌లోనే ఈ ఘటన జరగడంతో కలకలం రేగింది. ఏసీబీ అధికారులు వెంటనే ఎస్ఐ విజయ్‌ను అదుపులోకి తీసుకుని విచారణ నిమిత్తం తమ కార్యాలయానికి తరలించారు. ఈ కేసుకు సంబంధించి పూర్తి వివరాలు విచారణ అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది.

ఏపీకి మరో 7 రోజుల పాటు భారీ వర్ష సూచన



అమరావతి,అక్టోబర్,28: అర్నబ్ తుపాను ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లో కుండపోత వానలు కురుస్తున్నాయి. ఈ క్రమంలో రాష్ట్రానికి మరో ఏడు రోజుల పాటు భారీ వర్ష సూచన ఉన్నట్లు భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా, ముఖ్యంగా కోస్తాంధ్ర జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. వాతావరణ శాఖ తాజా నివేదిక ప్రకారం, కోస్తాంధ్ర, యానాంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. కొన్ని చోట్ల అత్యంత భారీ వర్షపాతం నమోదయ్యే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించారు. తీరం వెంబడి గంటకు 110 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రత్యేకించి తీర ప్రాంతాల వారు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని సూచించారు. ఇప్పటికే ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి జంకుతున్నారు. ఈ నేపథ్యంలోముఖ్యమంత్రి చంద్రబాబు తుపాను పరిస్థితిని ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షిస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా యంత్రాంగం పూర్తి అప్రమత్తతతో ఉందని, సహాయక చర్యలకు సిద్ధంగా ఉన్నామని అధికారులు తెలిపారు. మరోవైపు, రాయలసీమలో రాబోయే నాలుగు రోజుల పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది.

స్పెయిన్‌లో ఘోర రైలు ప్రమాదం:

46 మంది మృతి,179 మందికి గాయాలు



ఉర్దా : స్పెయిన్ దేశంలో పెను విషాదం చోటుచేసుకుంది. సెంట్రల్ టొలెడో ప్రావిన్స్‌లోని ఉర్దా ప్రాంతం సమీపంలో రెండు హై-స్పీడ్ ప్రయాణికుల రైళ్లు ఢీకొన్న దుర్ఘటనలో ఏకంగా 46 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదంలో మరో 179 మందికి పైగా తీవ్రంగా గాయపడినట్లుగా అధికారిక వర్గాలు వెల్లడించాయి. పోలీసుల కథనం మేరకు రాజధాని మాడ్రిడ్ నుంచి బయలుదేరిన' హై-స్పీడ్ ప్రయా ణికుల రైలు, అదే ట్రాక్‌పై వెళ్తున్న ఇరియో హై-స్పీడ్ లోకోమోటివ్‌ను బలంగా ఢీకొంది. ఈ రెండు ట్రైన్లు ఢీకొనడం వల్ల బోగీలు పట్టాలు తప్పి తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ ప్రమాద తీవ్రత కారణంగా మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని రెస్క్యూ అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈమేరకు సమాచారం అందుకున్న వెంటనే సివిల్ ప్రొటెక్షన్, ఎమర్జెన్సీ రెస్క్యూ టీమ్‌లు, అంబులెన్స్‌లు భారీ సంఖ్యలో స్పాట్‌కు చేరుకున్నాయి. తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులను సమీప ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాద స్థలంలో సహా యక చర్యలను ముమ్మరం చేశారు. ఈ దుర్ఘటన కార ణంగా మాడ్రిడ్-అండలూసియా మధ్య నడిచే మెయిన్ హై-స్పీడ్ రైలు మార్గంలో రాకపోకలను అధికారులు పూర్తిగా నిలిపివేశారు.

కర్ణాటక మండలి ఎన్నికల తీర్పును గౌరవిస్తాం.. డీకే



బెంగళూరు,అక్టోబర్,28: కర్ణాటక శాసన మండలి ఎన్నికల్లో ఎన్డీయే కూటమి నాలుగు స్థానాలను కైవసం చేసుకుని క్లీన్‌స్వీప్ చేయడం సంచలనంగా మారింది. తాజాగా వెలువడిన ఈ ఫలితాలపై ముఖ్యమంత్రి డీకే శివకుమా ర్ హుందాగా స్పందించారు. శాసన మండలి ఎన్నికల్లో పట్టభద్రులు, ఉ పాధ్యాయ ఓటర్లు ఇచ్చిన తీర్పును తాము శిరసావహిస్తూ గౌరవంగా స్వీ కరిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గతంలో ఒక స్థానం ఉండేదని, ఆ స్థానంలో తప్పక విజయం సాధిస్తామని భావి ంచామని.. అయితే ఓటర్లు తమకు ఒక స్పష్టమైన సందేశాన్ని పంపారని పేర్కొన్నారు. ఫలితాలను సమగ్రంగా అధ్యయనం చేసి, అవసరమైన దిద్దుబాటు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. పరాజయం ఎదురైనప్ప టికీ కాంగ్రెస్ అభ్యర్థులకు గణనీయమైన సంఖ్యలోనే ఓట్లు వచ్చాయని, పార్టీ శ్రేణులతో కలిసి ఓటమికి గల కారణాలపై పూర్తి స్థాయి సమీక్ష నిర్వహిస్తామని సీఎం స్పష్టం చేశారు. మరోవైపు ఈ మండలి ఎన్నికల ఫలితాలు రాబోయే సార్వత్రిక ఎన్నికలకు దిక్సూచి అంటూ విపక్షాలు చేస్తున్న విమర్శలను డీకే శివకుమార్ గట్టిగా తిప్పికొట్టారు.
మండలి ఉపఎన్నికల ఫలితాలే భవిష్యత్ రాజకీయాలకు ప్రామాణికమైతే.. ఇటీవల చన్నపట్న, షిగ్గావ్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో జరిగిన ఉపఎన్నికల ఫలితాలు కూడా రాబోయే ఎన్నికలకు సంకేతాలుగానే పరిగణించాలి కదా అని ఆయన ప్రతిపక్షాలను నేరుగా ప్రశ్నించారు.

రైల్వే నిలయం ఎదుట కాంగ్రెస్ మెరుపు ధర్నా



హైదరాబాద్,అక్టోబర్,28: సికింద్రాబాద్ రైల్వే నిలయం వద్ద ఉ ద్రిక్తత చోటుచేసుకుంది. రైల్వే నిలయం ముందు కాంగ్రెస్ మెరుపు ధర్నా నిర్వహించింది. ధర్నాలో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నా రు. మెట్లపై బైఠాయించిన కాంగ్రెస్ నేతలు.. ఆందోళనకు దిగారు. నవంబర్ 1న ఢిల్లీకి వెళ్ళేందుకు ప్రత్యేక రైళ్లు కావాలని పీసీసీ కోరగా.. దక్షిణ మధ్య రైల్వే శాఖ నిరాకరించింది. దీంతో కాంగ్రెస్ నేతలు.. రైల్వే శాఖ జీఎం కార్యాలయం ముందు మెరుపు ధర్నాకు దిగారు. కాంగ్రెస్ నేతలను అరెస్ట్ చేసిన పోలీసులు.. మల్కాజిగిరి జోన్‌లోని మార్కెట్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

పోలీసు అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివి

-పోలీస్ అమరుల త్యాగాలు చిరస్మరణీయం... -నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్... -దేశ రక్షణ ప్రజా భద్రత కోసం పోలీసుల ప్రాణ త్యాగం స్ఫూర్తిదాయకం... -పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా నారాయణపేటలో భారీ సైకిల్ ర్యాలీ... -పోలీస్ అధికారులు, సిబ్బంది,విద్యార్థులు, యువత,ప్రజల భాగస్వామ్యం... -జోహార్ పోలీస్ అమరవీరులకు జోహార్ జోహార్ అంటూ నినాదాలు...







నారాయణపేట,(డీకే చాటింపు): పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో (పోలీస్ ఫ్లగ్ డే-2026) భాగంగా విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ బుధవారం నారాయణపేట జిల్లా కేంద్రంలో ఎస్పీ డాక్టర్ వినీత్ ఆధ్వర్యంలో పోలీస్ అధికారులు,సిబ్బంది, విద్యార్థులు,యువకులు, ఉద్యోగులు,ప్రజలు,వివిధ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని పోలీస్ అమరవీరులకు ఘనంగా నివాళులర్పిస్తూ భారీ సైకిల్ ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు.అంబేద్కర్ చౌరస్తా వద్ద ప్రారంభమైన ఈ సైకిల్ ర్యాలీ ఆర్డీఓ ఆఫీస్, పాత బస్టాండ్,మెయిన్ చౌక్, సుభాష్ రోడ్, సత్యనారాయణ చౌరస్తా, యాద్గిరి రోడ్డు,జిశాన్ హోటల్,అంబేద్కర్ చౌరస్తా, మున్సిపల్ పార్క్ మీదుగా తిరిగి ఎస్పీ కార్యాలయం పరేడ్ మైదానం వరకు కొనసాగింది.ర్యాలీలో పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ జోహార్ పోలీస్ అమరవీరులకు జోహార్ జోహార్ అంటూ నినాదాలు చేస్తూ ప్రజల్లో దేశభక్తి,సేవాభావం, సామాజిక బాధ్యతను పెంపొందించే సందేశాన్ని చాటి చెప్పారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల ప్రాణాలు,ఆస్తుల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ, సమాజంలో నేరాల నియంత్రణ కోసం పోలీసులు నిరంతరం అంకితభావంతో విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు.విధి నిర్వహణలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ,ప్రజల భద్రత కోసం తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలు, త్యాగాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.ఈ సంవత్సరం దేశంలో 154 ప్రాణాలు త్యాగాలు చేశారని వారి త్యాగాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని,వారి ఆశయాలను కొనసాగించడం ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది బాధ్యత అని అన్నారు.పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల నిర్వహణ ప్రధాన ఉద్దేశం అమరవీరుల త్యాగాలను ప్రజలకు గుర్తుచేయడంతో పాటు,వారి సేవా స్ఫూర్తిని భావితరాలకు అందించడం అని తెలిపారు. ప్రజల రక్షణ కోసం ప్రాణాలను సైతం లెక్క చేయకుండా సేవలందించిన అమరవీరుల త్యాగాలకు సమాజం గౌరవం తెలపాలని పేర్కొన్నారు.పోలీస్ శాఖ ప్రజలకు మరింత చేరువ కావడానికి,పోలీసుల విధులు,బాధ్యతలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని ఎస్పీ తెలిపారు.ముఖ్యంగా యువత క్రమశిక్షణ, సేవాభావం,దేశభక్తి, సామాజిక బాధ్యత వంటి విలువలను అలవర్చుకోవాలని సూచించారు.ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు.సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులకు ప్రజలు సహకరించాలని,నేరాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని తెలిపారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ అవగాహన కార్యక్రమాలు,వ్యాసరచన పోటీలు,ఓపెన్ హౌస్,రక్తదాన శిబిరాలు,కొవ్వొత్తుల ర్యాలీల ద్వారా అమరవీరుల త్యాగాలను ప్రజలకు చేరవేస్తూ,పోలీస్-ప్రజల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎస్పీ పేర్కొన్నారు.పోలీస్ అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకొని ప్రజా సేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి ఎండి రియాజ్ హుల్ హక్,డీఎస్పీలు మహేష్, నల్లపు లింగయ్య,సీఐలు శివ శంకర్,రామ్ లాల్,భగవంత్ రెడ్డి,సైదులు,ఎస్సైలు వెంకటేశ్వర్లు,సతీష్ రెడ్డి, విజయ్ కుమార్,చంద్ర శేఖర్, పురుషోత్తం,భాగ్య లక్ష్మీ రెడ్డి, కృష్ణం రాజు,రాజు,ఎస్ఎం నవీద్,మహేందర్ రెడ్డి, గాయత్రి,రేవతి,శిరీష,శివ శంకర్,రామ్ లాల్,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలను పరిష్క రించాలి

జాతీయ సభ్యునికి వినతి పత్రం సమర్పిం చిన ఉద్యోగులు





నిజామాబాద్ ప్రతినిధి అక్టోబర్ 28 (డీకే చాటింపు):తెలంగాణ రాష్ట్రంలో జాతీయ ఆరోగ్య మిషన్ (ఛీఎవీ) పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులు గత 16 రోజులుగా తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపట్టిన నిరాహార దీక్ష నేటితో 16వ రోజుకు చేరు కుంది. ఈ నేపథ్యంలో, ఉద్యోగుల సమస్య లను పరిష్కరించి, వారి డిమాండ్లను నెరవేర్చేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి తగిన సహకారం అందించాలని కోరుతూ, జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ (చీజూ) సభ్యుడిజతోత్ హుస్సేన్ నాయక్ ని ఈరోజు ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో కలిసి వినతిపత్రం అంద జేశారు.ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు ప్రజారోగ్య సేవల్లో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం 16 రోజులుగా నిరాహార దీక్ష కొనసా గించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ప్రతినిధు లకు వివరించారు. ఉద్యోగుల డిమాండ్లను సానుకూలంగా పరిశీ లించి, ముఖ్యంగాహౌ ఉద్యోగుల క్రమబద్ధీ కరణతో పాటు ఇతర న్యాయమైన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకునేలా సంబంధిత ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలని జేపీసీ నాయకులు విజ్ఞప్తి చేశారు.ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తగిన చొరవ తీసుకొని, వారి న్యాయమైన హక్కులు సాధించే దిశగా సహకరించాలని ఈ సందర్భంగా కోరారు.

ఆర్మూర్ నియోజకవర్గ

రోడ్ల దుస్థితి ఎప్పుడు మారుతుంది

ఆమ్ ఆద్మీ పార్టీ
కన్వీ నర్ సయ్యద్ ఆవేజ్



ఆర్మూర్ నియోజకవర్గం లోని పెర్కిట్ నుంచి నిర్మల్ వెళ్లే రహదారిపై గుంతలు. ప్రజల ప్రాణాలకు ముప్పు అయినా అధికారులకు ప్రభుత్వాలకు పట్టద అని ఆర్మూర్ నియోజక వర్గఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ సయ్యద్ అన్నారు. నిర్మల్ వైపు వెళ్లే రహదారి దుస్థితి చూస్తుంటే బాధ కలగక మానదు. రోడ్డుపై అడుగడుగునా గుంతలు, దుమ్ము, అధ్వానంగా మారిన ప్రయాణ పరిస్థితులు ఉన్నప్పటికీ ప్రజా ప్రతినిధులకు, సంబం ధిత ప్రభుత్వ అధికా రులకు ఈ సమస్య కనిపించడం లేదా అని ప్రశ్నించారు? ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు వారికి పట్టవా?ఇది కేవలం రోడ్డు సమస్య కాదు.. ప్రజల ప్రాణాలకు సంబంధించిన అత్యవసర సమస్య! ఈ రహదారిపై ప్రతిరోజూ ఆర్టీసీ బస్సులు, కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు, ఇతర భారీ వాహనాలు ప్రయాణిస్తుంటాయి. రోడ్డుపై ఉన్న గుంతల కారణంగా వాహన దారులు తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొంటు న్నారు. ద్విచక్ర వాహనదారులు గుంతలను తప్పించు కునే క్రమంలో ప్రమాదా లకు గురయ్యే ప్రమా దం ఉంది. భారీ వాహ నాలు వెళ్లినప్పుడు దుమ్ము విపరీతంగా లేచి కళ్లలో పడుతోంది. దీంతో వాహనదారు లకు ఎదురుగా వచ్చే వాహనాలు సరిగ్గా కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఈ మార్గంలో, పాత జాతీయ రహదారి ఛీ-44 పరిధిలో ఉన్న ప్రాంతంలో రెండు మూడు ఫంక్షన్ హాళ్లు కూడా ఉన్నాయి. వివాహాలు, ఇతర శుభ కార్యాల సమయంలో చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు ఈ మార్గంలో ప్రయాణిస్తుంటారు. ఇలాంటి రహదారిపై సరైన మరమ్మతులు చేపట్టకపోతే ఏదైనా పెద్ద ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది? ప్రజాప్రతినిధులు ఇదే ప్రాంతంలోని ఫంక్షన్ హాళ్లకు వివాహాలు, ఇతర కార్యక్రమాలకు హాజరవుతున్నారు. మరి వారు ప్రయాణిం చే మార్గంలో సామాన్య ప్రజలు ఎదుర్కొంటు న్న కష్టాలు కనిపించ డం లేదా? విలాసవంత మైన కార్లలో ప్రయా ణించే వారికి రోడ్డు దుస్థితి అంతగా అనిపించకపోవచ్చు. కానీ అదే మార్గంలో ఆర్టీసీ బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాలపై ప్రయా ణించే సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటి? ప్రజలు పన్నులు కట్టేది ఇలాంటి రోడ్లపై ప్రమాదకరంగా ప్రయాణించడానికా? ప్రజలు ఇంటి పన్ను, నీటి పన్ను, రవాణాకు సంబంధించిన పన్నులు సహా అనేక రూపాల్లో ప్రభుత్వానికి ఆదాయం సమకూ రుస్తున్నారు. మరి ప్రజలకు కనీసం గుంతలు లేని, సురక్షిత మైన రహదారిని అందించడం ప్రభుత్వ బాధ్యత కాదాఅని ప్రశ్నించారు. మా ప్రధాన డిమాండ్లు:1. పెరికిట్ నుంచి నిర్మల్ వైపు వెళ్లే రహదారిని సంబంధిత అధికారులు వెంటనే పరిశీలించాలి. 2. రోడ్డు పై ఉన్న గుంతలను తక్షణమే పూడ్చి, అత్యవసర మరమ్మ తులు చేపట్టాలి. 3. అవసరమైన నిధులను వెంటనే మంజూరు చేసి, రహదారిని శాశ్వతంగా బాగు చేయడానికి చర్యలు తీసుకోవాలి. 4. రహ దారి పరిస్థితి కార ణంగా ప్రమాదాలు జరగకుండా దుమ్ము నియంత్రణ, హెచ్చరిక బోర్డులు వంటి తాత్కా లిక భద్రతా చర్యలు చేపట్టాలి. 5. సంబం ధిత శాఖల అధికారు లు, ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో పర్య టించి ప్రజల సమస్య లను స్వయంగా పరిశీలించాలి.ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు కళ్లు తెరవాలి!ప్రజలకు ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కాదు.. ప్రమాదం జరగక ముందే చర్యలు తీసుకోవాలి అని అన్నారు.

పాంచజన్య ఇంద్రవెల్లి బహిరంగ సభను

విజయవంతం చేయండి...

మాజీ కార్మిక శాఖ మంత్రి బోడ జనార్దన్....



బెల్లంపల్లి(డికే చాటింపు) టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఇంద్రవెల్లి లో నిర్వహించే పాంచజన్య సభ ను విజయవంతం చేయాలనీ, మాజీ మంత్రి బోడ జనార్దన్ అన్నారు. ఈ మేరకు బుధవారం బెల్లంపల్లి లో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో పాంచజన్య పోస్టర్ విడుదల చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 30న ఇంద్ర వెల్లి పాంచజన్య బహిరంగ సభను విజయవంతం చేయాలని టిఆర్ఎస్ నాయకులకు కార్యకర్తలకు పిలుపునిచ్చారు, గత బిఆర్ ఎస్ ప్రభుత్వం,ప్రస్తుత అధికార కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మూడు సంవత్సరాలు గడుస్తున్న ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని బిఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీలు ప్రజలను మోసం చేశాయని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించడానికి ఈ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు ముఖ్య అతిథిగా టిఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత రానున్నారని, అధిక సంఖ్యలో పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి సిద్ధం శెట్టి సాజన్, బెల్లంపల్లి ఇంచార్జ్ బండారి శ్రీనివాస్ గౌడ్,మంచిర్యాల నియోజకవర్గ ఇంచార్జి మహేందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు శేశికాంత్, మండల అధ్యక్షులు కందుల స్వరాజ్, నాయకులు మహంతి,కార్తీక్, శ్రీనాథ్, రేవంత్,శ్రావణ్, సల్ల సాయి, ప్రేమ్, ఇందూరి సాయి, ఖాదర్, పాల్గొన్నారు

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం....



జనగామ / కొడకండ్ల అక్టోబర్ 28 డీకే చాటింపు జిల్లా ప్రతినిధి గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రజాప్రతినిధులు, అధికారులు అన్నారు. బుధవారం జనగామ జిల్లా కొడకండ్ల మండలం లక్ష్మక్కపల్లి గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.వ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా గ్రామీణ ప్రజలకు స్థానికంగానే వైద్య సేవలు అందడంతో పాటు,అత్యవసర సమయాల్లో సకాలంలో చికిత్స పొందేందుకు అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు,అధికారులు వైద్య సిబ్బంది,కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణను కరువు రాష్ట్రంగా ప్రకటించాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



(డీకే చాటింపు,హైదరాబాద్): ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో తీవ్ర కరువు నెలకొన్న నేపథ్యంలో కొన్ని మండలాలకే పరిమితం చేయకుండా తెలంగాణ మొత్తాన్ని కరువు ప్రభావిత రాష్ట్రంగా ప్రకటించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని కోరారు. కరువు నుంచి ప్రజలను కాపాడేందుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే సమగ్ర కార్యాచరణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కరువు పరిస్థితులను ఆసరాగా చేసుకుని ఎవ్వరైనా నిత్యావసర వస్తువులను అక్రమంగా నిల్వచేసి బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. గోదాముల్లో సరుకులను దాచిపెట్టి కృత్రిమ కొరత సృష్టించే వ్యాపారులపై సిపిఐ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి పేదలకు పంచుతామని స్పష్టం చేశారు. బుధవారం సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్. ఎం.బాలనర్సింహ్మాలతో కలిసి ఆయన మీడియా సమావేశంనిర్వహించారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ కరువు పరిస్థితుల నేపథ్యంలో రాజకీయ విమర్శలకు పరిమితం చేయకుండా కరువు నివారణ, ప్రజలకు ఉపశమనం కల్పించే చర్యలపై ప్రభుత్వాలు దృష్టి సారించాలని సూచించారు. రాష్ట్రంలో సగానికి పైగా మండలాల్లో కరువు నెలకొన్న నేపథ్యంలో తెలంగాణ మొత్తాన్ని కరువు ప్రభావిత రాష్ట్రంగా ప్రకటించి రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు పంపి, తగిన నిధులు సాధించాలని ప్రభుత్వాన్ని కోరారు.

మాతా శిశువులకు టీ కాల ఇక్కట్లు

చోద్యం చూస్తున్న అధికారులు

నిజామాబాద్ ప్రతినిధి అక్టోబర్ 28 (డీకే చాటింపు):వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రతి బుధవారం శనివారం ఇవ్వాల్సిన టీకాలు ఇవ్వడంలో అధికారు లు నిర్లక్ష్యంగా వ్యవహ రించడంతో తల్లులు పిల్లలు ఇక్కట్లు పడుతున్నారు. నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులు ముఖ్యంగా ఏఎన్ఎంలు ఫార్మసిస్టులు తదితరులు సమ్మెలో ఉండడంతో రోజువారి కార్యక్రమాలు ముఖ్యంగా టీకాలు ఇవ్వడంలో జాప్యం చేస్తున్నారు. ప్రధానంగా బోధన్ డివిజన్ కేంద్రంలో టీకల కార్యక్రమం పట్ల వైద్యాధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. అర్బన్ ప్రైమరీ సెంటర్లు పానుగల్లి రాకాసి పేటలు ఉండగా ఆశాల ద్వారా టీకాలకు తల్లులను పిల్లలను మొబిలైజ్ చేయాల్సి ఉండగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఏరియా ఆసుపత్రి లో వ్యాక్సిన్ ఇస్తున్నారని అక్కడికి వెళ్లాలని కసురు కుంటూ పంపిస్తు న్నారు. మహిళలు బాలింతలు చిన్న పిల్లలు ఉండగా కిలోమీటర్ల తరబడి అటు ఇటు తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. సరైన సమాచారం ఇవ్వకుండా ఆమర్యా దగా ప్రవర్తిస్తున్నారని ఆవేదన చెందారు. బోధన్ ఏరియా ఆసుపత్రిలో ఒక్క సూపర్వైజర్ తో టీకాలిపియడంతో గంటల తరబడి తల్లులు వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ఇంకొక ఇద్దరిని ఏర్పాటు చేసినట్లయితే బాగుండేదని తల్లులు అన్నారు.ఒకవైపు రెగ్యులర్ సూపర్వైజర్లు ఏఎన్ఎంలతో టీకాలు ఇప్పిస్తున్నామని చెప్తున్న అధికారులు క్షేత్రస్థాయిలో మాత్రం భిన్నంగా ఉంది. ఇట్టి టీకాల కార్యక్రమం లో పేషంట్ల పట్ల తల్లుల పట్ల దృష్టిగా ప్రవర్తించిన డాక్టర్ స్టాఫ్ నర్స్ లపై జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేయనున్నట్లు తల్లులు తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రెగ్యులర్ టీకాలు ఇస్తున్నప్పటికీ అర్బన్ సెంటర్లలో ఉన్న రెగ్యులర్ సిబ్బంది, పర్యవేక్షకులు ,డాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహ రిస్తూ శాఖకి చెడ్డ పేరు తెస్తున్నారు. నిజామాబాద్ అర్బన్ సెంటర్ల పరిధిలో ఒక్కొక్క చోట ఇద్దరేసి సూపర్వైజర్ అధికారులు ఉండగా అర్సపల్లిలో రెగ్యులర్ వారు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లా ఉన్నతాధికారులు ముఖ్యంగా డి ఐ ఓ, డిప్యూటీ డిఎంహెచ్వో దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



జాతీయ యస్.టి కమిషన్ సభ్యులు శ్రీ జాటోతు హుస్సేన్ నాయక్ ని మర్యాద పూర్వకంగా కలిసిన నిజామాబాద్ పోలీస్ కమిషనర్



నిజామాబాద్ ప్రతినిధి అక్టోబర్ 28 (డీకే చాటింపు):బుధవారం జిల్లా పర్యటన నేపథ్యంలో ఐ.డి.ఓ.సి నందు జాతీయయస్.టి కమిషన్ సభ్యులు జాటోతు హుస్సేన్ నాయక్ ని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య, పువ్వుల మొక్క అందజేసి మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది.

డీకే చాటింపు
తెలంగాణ దిన పత్రిక
గురువారం,అక్టోబర్,29, 2026

ఇండోర్ ఘటన కనువిప్పుకావాలి

ఏమాత్రం ఆలోచన ఉన్నవారైనా సరే, మంచినీళ్ల పైప్‌లైన్ మీద మరుగుదొడ్డి కడతారా? ఇంటింటికీ సరఫరా అయ్యే నీటిలో మురుగు నీరు వచ్చిన కలుస్తుంటే అధికారులు ఏం చేస్తున్నట్లు? అలా కట్టిన మరుగుదొడ్డి గుంత నుంచి పెల్లుబికిన వ్యర్థ జలాలు, ఆ టాయిలెట్ కింద నుంచి వెళ్తున్న ప్రధాన తాగునీటి పైప్‌లైన్‌లో కలవడంతో ఇండోర్‌లో విషాదాన్ని మిగిల్చింది. జీవితాన్ని సంతోషంగా గడపాలంటే ముందు ఆరోగ్యం బాగుం డాలి. ఊరికే జబ్బు పడకూడదంటే జనావాసాల్లో పారిశుద్ధ్య సమస్యలు లేకుండా ఉండడంతో పాటు ప్రతిఒక్కరూ సురక్షితమైన తాగునీటికి నోచుకోవాలి. ఈ రెండు కరువైన చోట రోగాలు విజృంభించి అకా ల మరణాలకు మూలమవుతాయి. మన దేశంలో చాలా మందికి కనీసం మంచినీరు అందించలేని పరిస్థితుల్లో చాలా రాష్ట్ర ప్రభుత్వాలు ఉండడం ఆలోచించాల్సిన విషయం. ఒక పక్క భారత్ త్వరలో ప్రపంచంలోనే అతిపెద్ద మూడో ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవిస్తుంది అని గొప్పలు చెప్పుకుంటున్నప్పటికీ సరైన తాగునీటి కోసం కొట్లాడుతున్న పరిస్థితి కానీ, తాగునీటికి సరైన వసతి లేని గ్రామాలు, పట్టణా లు ఇప్పటికీ దేశంలో చాలానే ఉన్నాయి. దేశంలో దాదాపు ప్రతీ ఏటా 37.7 మిలియన్ల మంది నీటి సంబంధించిన వ్యాధు లతో కాలగర్భంలో కలిసిపోతున్నట్లు తెలుస్తోంది. సగటున దేశంలో రోజూ 585 మంది కలుషిత నీరు తాగడం వలన, నీటి సంబంధించిన వ్యాధులతో మరణిస్తున్నారు అని పలు నివేదికలు పేర్కొంటు న్నాయి. ఇటీవల కాలంలో మహారాష్ట్ర, కర్ణాటక, కేరళలో వరుసగా కలుషిత నీటి ఉదంతాలు చోటుచేసుకోగా తాజాగా స్వచ్ఛ నగరంగా పేరు పొందిన ఇండోర్‌లోని భగీరథ్‌పుర ప్రాంతంలో కలుషిత నీరు తాగడం వల్ల సుమారు 12 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశముంది. ప్రజల ప్రాణాలకు కలుషిత వ్యర్థాలతో ఎలాంటి ప్రమాదాలు తలెత్తకుండా చూసే బాధ్యత ప్రభుత్వాలేదనని గుర్తు చేస్తూ ఐక్యరాజ్యసమితి సర్వ ప్రతినిధి సభ 2010లో స్వచ్ఛమైన తాగునీరు, పరిశుభ్రమైన పరిసరాలను మానవ హక్కుల్లో అంతర్భాగంగా గుర్తించింది. కానీ నిర్లక్ష్యంలో తేలియాడుతున్న అధికార యంత్రాంగం కారణంగా వ్యక్తిగత, గృహావసరాలకు తగినంత మంచినీటిని నిరం తరం పొందే హక్కు జన భారతానికి ఉన్నా లేనట్లుగానే అనిపిస్తున్నది. వరుసగా ఎనిమిదేళ్లపాటు దేశంలోనే శుభ్రమైన నగరంగా పురస్కారాలు పొందిన ఇండోర్‌లోనే పరిస్థితి ఇలా ఉంటే.. చెత్త, మురుగునీటికి ఆవాసాలుగా పేరు పడ్డ హైదరాబాద్, విజయవాడ, వైజాగ్, తిరుపతి, తదితర నగరాల పరిస్థితి ఏమిటనేది ఆలోచించుకోవాల్సిన అవసరం ఉంది. ఏటా 3.77 కోట్ల మంది భారతీయులు కలుషిత నీళ్లలో నుంచి పురుడు పోసుకునే జబ్బుల బారినపడుతున్నారు. 15 లక్షల మంది పిల్లలు డయేరియాతో చనిపోతున్నారు. జల కాలుష్యంతో ప్రజల అనారోగ్యం దెబ్బతింటుండడంతో దేశం ఏడాదికి 7.3 కోట్ల పనిదినాలను నష్టపోతుంది. దానివల్ల భారత్‌కు సంవత్సరానికి 60 కోట్ల డాలర్ల ఆర్థిక నష్టం సంభవిస్తోంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు పూర్తవుతున్నప్పటికీ నేటికీ అందరికీ కనీసం విద్య, వైద్యం అందుబాటులో లేదు. అక్షరాస్యత అంతంత మాత్రంగానే ఉంది. ఇక మహిళల్లో బహు తక్కువ అక్షరాస్యత ఉన్న మాట వాస్తవం. దేశంలో చాలా రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థ 'లిక్కర్ కిక్' పైనే ఆధారపడి ఉండడం చాలా దురదృష్టకరమైన విషయం. ఏ ప్రభుత్వాలైన ఆ రాష్ట్ర ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని కోరుకోవాలి. కానీ మన ప్రభుత్వాలు ముఖ్యంగా పండగ వేళల్లో, ప్రత్యేక రోజుల్లో మద్యం ఎక్కువగా ఉత్పత్తి చేయడంతో పాటు ఆ మద్యాన్ని బాగా సేవించి, ప్రభుత్వాలకు ఆదాయం పెరగడానికి వీలుగా టైం పొడిగింపు ద్వారా ఎక్కువ మంది తాగుబోతులను తయారు చేసే ప్రయత్నం జరుగుతున్నది. తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పరచడానికి ప్రభుత్వాలు తగిన చర్యలు చేపట్టాలి. దేశం అభివృద్ధి, ఔన్నత్యం ఆ దేశ ప్రజల నైపుణ్యాలపైన ఆధారపడి ఉంటుంది.. ఉత్పత్తి రంగంలో, సేవా రం గాల్లో ప్రజలు పాలుపంచుకోవడం ద్వారా దేశాభివృద్ధి ఆధారపడి ఉంటుంది... మన పాలకులు కలలు కంటున్న వికసిత్ భారత్ సాధ్యం కావాలంటే, ప్రభుత్వాలు ప్రజల కనీస అవసరాలు తీర్చుకోవడానికి అవసరమైన విద్యను అందించాలి.. వైద్య రంగాన్ని బలోపేతం చేయడానికి సన్నా హాలుచేయాలి. ఉద్యోగ ఉపాధిఅవకాశాలు కల్పించాలి. వల సలుతగ్గించాలి.. ఓటు బ్యాంకు రాజకీయాలు మానాలి. ఆ విధంగా ప్రభుత్వాలు ప్రజల జీవన స్థాయి మెరుగు పరిచే ఆశయాలను రూపొందించుకుని, ప్రతీ నూతన సంవత్సరం నూతన విధానాలు ద్వారా ప్రజల తలసరి ఆదాయం పెరగడానికి కొత్త కొత్త ప్రాజెక్టులు రూపొందించి వాటిని అమలు చేయాలి. ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెట్టే కలుషిత వ్యర్థాలకు చెక్ పెట్టే ప్రయత్నం జరగాలి.



టపాకాయల దుకాణా దారులు పోలీస్ అధికారుల అనుమతి తీసుకోవాలి

పోలీస్ కమిషనర్ వెల్లడి సాయి చైతన్య

నిజామాబాద్ ప్రతినిధి అక్టోబర్ 28 (డీకే చాటింపు): దీపావళి పండుగ సందర్భంగా నిజామా బాద్ జిల్లా పోలీస్ కమీషనరేటు పరిధిలో తాత్కాలిక టపాకా యల దుకాణాలు నెలకొల్పేవారు వారి వారి సంబంధిత డివిజినల్ పోలీస్ అధికారి కార్యాలయం నుండి ధరఖాస్తు చేసుకొని అనుమతి పొందాలని పోలీసు కమిషనర్ సాయి చైతన్య తెలిపారు. దానికి సంబం ధించిన ఇతర సమాచారం కోసం సంబంధిత డివిజినల్ స్థాయి అధికారిని సంప్రదించా లన్నారు. ఎవ్వరయిన సంబంధిత డివిజినల్ పోలీస్ అధికారి నుండి అనుమతి లేకుండా టపాకాయల దుకాణా లను నెలకొల్పి నట్లయి తే వారిపై ఎక్స్ ప్లోజివ్ యాక్టు-1884మరియు రూల్స్ 1933 సవరణ 2008 ప్రకారంగా కఠిన చర్యలు ఉంటాయ న్నారు. టపాకాయల దుకాణా దారులు తప్పక ఈ క్రింది నిబంధనలు పాటించాలి టపాకాయల దుకాణాలు సంబందిత ఖాళీ ప్రదేశాలలో నెలకొల్పవలెను. ఖాళీ ప్రదేశానికి సంబంధిం చిన ఎన్.ఓ.సి సర్టిఫి కేటు పొందపర్చాలి, ఒక క్లస్టర్లో 50 షాపు లకు మించరాదు, జనరద్దీగల ప్రదేశాలలో ఎలాంటి టపాకాయల షాపుల ఏర్పాటు చేయరాదు. అదేవిధంగా కళ్యాణ మండపా లలో మరియు సమావేశాల కేంద్రాలలో టపాకాయల దుకాణా లు నెలకొల్పరాదు. తాత్కా లిక టపాకా యల దుకాణాలలో ఫైర్ కు సంబంధించిన జాగ్రత్తలు పాటించేవిధంగా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. పూర్తివివరాలతో కూడిన దరఖాస్తు ఫారంను సంబంధిత ఎ.సి.పి కార్యాలయం లో ఇవ్వాలన్నారు.



ట్రాన్స్‌జెండర్లకు కౌన్సెలింగ్ నిర్వహించి న సీసీఎస్ ఏసీపీశ్రీశైలం

ప్రజలకు ఇబ్బందులు కలిగించకుండా, సమాజంలో గౌరవప్రదంగా జీవించాలి





నిజామాబాద్ ప్రతినిధి అక్టోబర్ 28 (డీకే చాటింపు): నిజామాబాద్ జిల్లా ట్రాన్స్‌జెండర్లకు,సి.సి.యస్ పోలీస్ స్టేషన్ యందు సి.సి.యస్ ఏసీపీ శ్రీశైలం కౌన్సె లింగ్ నిర్వహించారు.

ఏసీపీ శ్రీశైలం మాట్లా డుతూ ట్రాన్స్‌జెండర్లు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలిగించ కుండా , న్యూసెన్స్‌కు పాల్పడకుండా శాంతియుతంగా వ్యవహరించాలని సూచించారు. సమా జంలో ప్రతి ఒక్కరూ గౌరవప్రదంగా జీవిం చేందుకు కృషి చేయా లని , చట్టవిరుద్ధమైన చర్యలకు దూరంగా ఉండాలని తెలిపారు. అనంతరం ట్రాన్స్ జెండర్లు ఎదుర్కొంటు న్న వ్యక్తిగత సామాజిక సమస్యలను క్షుణ్ణంగా అడిగి తెలుసుకు న్నారు. వారి సమస్యల పరిష్కారానికి సంబం ధిత మార్గాల్లో సహాయం పొందాలని సూచించారు. ఎలాంటి సమస్యలు ఎదురైనా చట్టాన్ని ఆశ్రయించా లని , ఎవరూ నిరుత్సా హానికి గురికాకుండా గౌరవప్రదమైన జీవనం కొనసాగించాలని తెలిపారు. ట్రాన్స్‌జెండర్లకు ఏవైనా సమస్యలు , ఇబ్బందులు ఎదురైతే సహాయం కోసం టోల్‌ఫ్రీ నంబర్ 14427ను సంప్రదించాలని సూచించారు. ప్రజల్లో శాంతిభద్రతల పరిర క్షణతో పాటు , ట్రాన్స్ జెండర్ల సమస్యలను తెలుసుకొని వారికి తగిన మార్గదర్శకత్వం అందించడమే ఈ కౌన్సెలింగ్ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. సమావేశంలో సిసిఎస్ సీఐలుసురేష్, అజయ్ సాయినాథ్ , ఎస్సైలు మహేష్ , భీమ్రావు , మహిళ ఆర్ఎస్ఐ ప్రవంతి , సఖీ సెంటర్ ఇన్చార్జి భానుప్రియ మరియు జిల్లాలోని ట్రాన్సజెండర్లు పాల్గొనడం జరిగింది.

వ్యక్తిని హత్య చేసిన ముద్దాయికి జీవిత ఖైదు, 5వేల జరిమానా

నిజామాబాద్ సెషన్స్ జడ్జి భారత లక్ష్మీ తీర్పు

నిజామాబాద్ ప్రతినిధి అక్టోబర్ 28 (డీకే చాటింపు): భూతు మాటలు తిట్టిండని ఒక వ్యక్తిని హత్య చేసిన కేసులో ముద్దాయి బైరి నర్సగౌడ్ కు జీవిత కారాగార శిక్ష విదిస్తూ నిజామాబాద్ సెషన్స్ జడ్జి జీ.వి.ఎన్ భారత లక్ష్మీ బుధవారం తీర్పు చెప్పారు. పబ్లిక్ ప్రాసి క్యూటర్ ధర్పల్లి రాజేశ్వర్ రెడ్డి తెలిపిన వివరాలు ఈ విదంగా ఉన్నాయి. తాటి పామూల శివప్రసాద్ గౌడ్ , బైరి నర్సాగౌడ్ నిజామాబాద్ రూరల్ మండలం కొత్తపేట మల్కాపూర్ గ్రామ వాస్తవ్యులు. 2024 జూన్ 06 న ఉదయం ఆరు గంటలకు శివ ప్రసాద్ దైవ దర్శనం చేసుకుందామని వెలు తుండగా మార్గమ ధ్యలో నర్సాగౌడ్ ఎదురు పడటంతో తనను ఉద్దేశించి శివప్రసాద్ భూతు మాటలు తిట్టిండు అని కోపగించి దగ్గరలో ఉన్న కట్టేతో తలపై కొట్టి గాయపరచాడు. తనను చెప్పుకోలేని భూతుమాటలు తిట్టాడని మనసులో రగిలిపోయిన మరింత కోపం తెచ్చుకున్న నర్సాగౌడ్ మళ్లి మధ్యాహ్నం మూడు గంటలకు శివప్రసాద్ ఇంటికి వెళ్లి వెంట తెచ్చుకున్న కట్టేతో బలంగా తలపై ఇతర శరీర బాగాలపై తీవ్రంగా కొట్టడంతో గాయల పాలైన అతనిని కటుంబ సభ్యులు నిజామాబాద్ నగరంలోని ప్రగతి ఆసుపత్రిలో చేర్పిం చారు. ఆ తరువాత అతన్ని నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చేర్పిం చారు. ఆసుపత్రిలో వైద్య చికిత్స పొందుతూ కోమాలోకి వెళ్లడంతో శివప్రసాద్ బతికే అవకాశాలు లేవని వైద్యులు తెల పడంతో కుటుంబ సభ్యులు ఇంటికి తీసుకువెళ్లారు. ఇంటికి వెళ్లిన తరువాత అతను మరణించాడని వారు తెలపడంతో పోలీసులు వైద్యులచే పోస్ట్ మార్టమ్ నిర్వహింప జేశారు. సమగ్ర నేర విచారణ అనంతరం పోలీసు అధికారులు చార్జీషీట్ ను కోర్టులో సమ ర్పించారు. నేర న్యాయ విచారణలో భాగంగా చార్జీషీట్ అనుసారం 21 మంది సాక్షుల వాంగ్మూ లాలు నమోదు చేసిన సెషన్స్ కోర్టు 19 ధ్రువీకరించు కున్న పత్రాలు మరొక వస్తుగత సాక్ష్యాన్ని మార్క్ చేసుకుని ప్రాసిక్యూషన్ , డిఫెన్స్ న్యాయవాది వాదనలు విన్నారు. ముద్దాయి నర్సాగౌడ్ పై హత్య నేరం రుజువు అయినట్లు నిర్దారిం చింది. హత్యనేరంకుగాను జీవిత ఖైదుతో పాటు ఐదు వేల రూపాయల జరిమానా విదిస్తూ సెషన్స్ జడ్జి భారత లక్ష్మీ తీర్పు వెలువరించారు. యెడల అదనంగా ఆరు నెలల జైలుశిక్ష అనుభవించాలి జడ్జి తమ తీర్పులో పేర్కొ న్నారని పిపి రాజేశ్వర్ రెడ్డి తెలిపారు. ఇట్టి కేసు లో నిందితునికి శిక్ష పడడంలో ప్రముఖ పాత్ర పోషించిన ఇన్వెస్టిగేషన్ అధికారులు ఎస్సైజె . రామారావు , జి . మహేష్ , ఎస్.ఐ ఎస్. సతీష్ సి.ఐ ,ఎన్ . సురేష్ కుమార్ సి.ఐ ,పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి. రాజేశ్వర్ రెడ్డి , ట్రీఫింగ్ ఆఫీసర్ సి. హెచ్ . శ్రీనివాస్ సి.ఐ , నిజామాబాదు రూరల్ పి. యస్ , టి. గోవిం ద్ ఎస్ఐపి కోర్టులైజన్ ఆఫీసర్ , కోర్టు సీఎంఎస్ మరియు సిడిఓ లను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ప్రశంసిస్తూ అభినందించారు.

రైల్వే నిలయసం వద్ద కాంగ్రెస్ మెరుపు ధర్నా కింద పడ్డ టీపిసీసీ చీఫ్, మంత్రి పొన్నం



(డీకే చాటింపు,హైదరాబాద్): నగరంలోని సికింద్రాబాద్ రైల్వే నిలయం వద్ద కాంగ్రెస్ నాయకులు బుధవారం మెరుపు ధర్నా నిర్వహించారు.పోలీసులు దురుసుగా ప్రవర్తిస్తున్నారని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో తోపులాట జరగ్గా టీ పి సీ సీ చీఫ్ మహేష్ కుమార్, మంత్రి పొన్నం కింద పడ్డారు. ఈ సందర్భంగా మహేద కుమార్ మాట్లాడుతూ నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో కాంగ్రెస్ మెగా ర్యాలీ,రెండు, మూడు నెలలుగా ధర్నాలు, నిరసనలు చేపడుతున్నామన్నారు.ఇండియా కూటమి ర్యాలీ కోసం ప్రత్యేక రైళ్లు కేటాయించాలని ఎంపీలు అనిల్ యాదవ్, మల్లు రవి ప్రత్యేక రైళ్ల కోసం జీఎంకు దరఖాస్తు చేశారని ఆయన తెలిపారు. ఆరు రోజుల పాటు కాలయాపన చేసి చివరి నిమిషంలో రైళ్లు ఇవ్వలేమని,ఉద్దేశపూర్వకంగానే ప్రత్యేక రైళ్లను నిరాకరించారని మహేష్ కుమార్ మండిపడ్డారు.రైళ్ల కోసం వెళ్తే పోలీసుల దురుసు ప్రవర్తన మోదీ, అమిత్ షా సూచనల మేరకేసన్నారు.దక్షిణాది నేతలు ఢిల్లీ ర్యాలీకి వెళ్లకుండా అడ్డుకునే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు.ఎన్ని అవాంతరాలు ఎదురైనా ర్యాలీలోపాల్గొంటాం. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో జన సమీకరణకు కాంగ్రెస్ నేతల సన్నాహాలు.ఢిల్లీలో నిరసన గళం వినిపించి తీరుతాం.ప్రత్యేక రైళ్లు ఇవ్వకపోయినా ఢిల్లీ నిరసన ర్యాలీలో పాల్గొంటాం.మోడీ ఫాసిస్టు పాలనకు నూకలు చెల్లాయి.నిరసన ర్యాలీ లో పాల్గొని తీరుతామని మహేష్ కుమార్ హెచ్చరించారు.



అండర్ --13 సబ్ జూనియర్ జాతీయ సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికైన సిఓఈ విద్యార్థి వేల్పుల రిషి...



బెల్లంపల్లి (డికే చాటింపు) తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ బెల్లంపల్లిలో ఆరవ తరగతి చదువుతున్న వేల్పుల రిషి, తెలంగాణ రాష్ట్రస్థాయి అండర్ 13 మినీ సబ్ జూనియర్ ఇంటర్ డిస్టిక్ సాఫ్ట్ బాల్ చాంపియన్షిప్ 16 అక్టోబర్ నుండి 17 అక్టోబర్ 2026 ఎల్బీ కాలేజ్ ములుగు రోడు హనుమకొండలో నిర్వహించిన సాఫ్ట్బాల్ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బెస్ట్ ఆల్ రౌండ్ ప్లేయర్ గా నిలిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక అవడం పట్ల ప్రిన్సిపల్ ఆకిడి విజయసాగర్ విద్యార్థికి అభినందనలు తెలిపారు. జాతీయ స్థాయి పోటీలు ఈ నెల అక్టోబర్ 29,30 ,31 తేదీలలో మహారాష్ట్రలోని సంజీవని యూనివర్సిటీ కోపర్గాన్ లో జరుగుతాయని తెలంగాణ రాష్ట్ర సాఫ్ట్ బాల్ అసోసియేషన్ సెక్రెటరీ కాసల నవీన్ కుమార్ మరియు మంచిర్యాల జిల్లా సెక్రెటరీ బాసబోయిన కిరణ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ తన్నీరు గోపి, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ దుర్గం రమాదేవి, కమలాకర్, శ్రీనివాసరావు విద్యార్థికి అభినందనలు తెలుపుతూ ఆల్ ద బెస్ట్ చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు ముచ్చకుర్తి రాజశేఖర్, ఆలూరి వామన్ పాల్గొన్నారు .

మోస్రా గ్రామంలో 38.42 గ్రాముల ఆల్ర్ఫాజోలం స్వాధీనం

నిజామాబాద్ ప్రతినిధి అక్టోబర్ 28 (డీకే చాటింపు): బాన్సువాడ నియోజకవర్గం మోస్రా గ్రామంలో మత్తు పదార్థాలు కలపడానికి తీసుకొచ్చా రు అని విశ్వసనీయ సమా చారం మేరకు నింది తుడి ఇంటివద్ద సోదా లు నిర్వహించగా ఈ సోదాల్లో మోస్రా గ్రామానికి చెందిన బొజ్జ స్వామి గౌడ్ (వయస్సు 51 సంవత్సరాలు), కల్లు వ్యాపారి వద్ద 38.42 గ్రాముల ఆల్ర్ఫాజోలం అనుమా నిత పదార్థం లభించిం దనీ ఎస్సై వంశీకృష్ణా రెడ్డి విచారణలో సదరు వ్యక్తి సుమారు 50 గ్రాముల ఆల్ర్ఫాజో లంను 50 వేలకు కొనుగోలు చేసి, కల్లు అమ్మకాలను పెంచి అధిక లాభాలు పొందాలనే ఉద్దేశంతో కల్లులో కలుపుతు న్నట్లు తెలిపాడు. నిందితుడుని అరెస్టు చేసి రిమాండ్కు తరలించినట్లు తెలిపారు.

కర్మాన్‌ఘాట్ బీరప్ప స్వామి పండుగలో పాల్గొన్న మాధవ్ నగర్ కాలనీ అధ్యక్షుడు గోపాల్ ముదిరాజ్



ఎల్బీనగర్, (డీకే చాటింపు) కర్మాన్‌ఘాట్-బైరామల్ గూడ లోని అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడైన శ్రీశ్రీశ్రీ బీరప్ప స్వామి, కామరాతి దేవి ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు బీరప్ప పండుగ సందర్భంగా మాధవ్ నగర్ కాలనీ అధ్యక్షుడు బి. గోపాల్ ముదిరాజ్ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఎల్లమ్మ, పరశురాముడు వేషధారణ కార్యక్రమాన్ని తిలకించి బీరప్ప స్వామి, కామరాతి దేవిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు గోపాల్ ముదిరాజ్ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇమిడి బీరప్ప దేవాలయ కమిటీ సభ్యులు చీర సురేష్, చీర శ్రీనివాస్, ఇమ్మిడి రాజు, ఇమ్మిడి జంగయ్య, ఇమ్మిడి బాలప్ప, యమ్మభాష కురుమ, సిద్దాల గణేష్, లక్ష్మణ్ యాదవ్, కాలే జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ -రంగారెడ్డి -మహబూబ్ నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమంలో ముఖ్యఅతిథి పాల్గొన్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

ఎల్బీనగర్, (డీకే చాటింపు) ఎల్బీనగర్ నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ దేవిరెడ్డి సుధీర్ రెడ్డి గారు హయత్ నగర్ డివిజన్ పరిధిలోని రంగనాయకుల గుట్ట వద్ద జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్హులైన పట్టభద్రులందరూ ఎమ్మెల్సీ ఓటరుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని,ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు .పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించాలని సూచించారు. ఇట్టి కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సామ తిరుమలరెడ్డి,డివిజన్ అధ్యక్షులు చెన్నగోని శ్రీధర్ గౌడ్,గుడాల మల్లేష్,భాస్కర్ సాగర్,ప్రదీప్,స్కైలాబ్,రాకేష్, వెంకటేష్, రవి,రాజు,మధు,వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



పాత్రికేయులు లేని సమాజం చీకటిమయం

రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ పురుషోత్తం



డీకే చాటింపు ప్రతినిధి,(హైదరాబాద్): మనిషి కి ప్రాణవాయువు ఎలాగో... సమాజానికి జర్నలిజం, జర్నలిస్టులు అలాగేనని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం అన్నారు. సూర్యుడు లేని సమాజం ఏ విధంగా ఉంటుందో జర్నలిస్టులు లేని సమాజం కూడా అదే విధంగా ఉంటుందని అన్నారు. జర్నలిస్టులు సమాజానికి దిశా నిర్దేశం చేసే వారని, అటువంటి జర్నలిస్టులు నేడు అత్యంత దయనీయమైన స్థితిలో ఉన్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం హైదరాబాద్ లోని చిక్కడపల్లిలోని త్యాగరాయ గాన సభలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ 76వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని పలువురు సీనియర్ పాత్రికేయులను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ప్రొఫెసర్ పురుషోత్తం మాట్లాడుతూ,పాత్రికేయులు సమాజానికి వెలుతురులాంటి వారని, పాత్రికేయులే లేకపోతే సమాజం చీకటిమయమవుతుందని అన్నారు.ఒకప్పుడు పత్రికలు, పాత్రికేయులంటే సమాజానికి, ప్రభుత్వాలకు దిశా నిర్దేశం చేసే స్థాయిలో ఉండేదని, కానీ ప్రస్తుతం రాజకీయ నాయకులు, పాలకులు జర్నలిస్టులను పావులుగా వాడుకుంటున్నారే తప్ప జర్నలిస్టుల సంక్షేమం కోసం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల విషయమై చాలా నిర్లక్ష్యం చేశాయని, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం సుముఖంగా ఉన్నారని అన్నారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం తనవంతు బాధ్యతగా అన్ని విధాలుగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని న్నారు. మీడియా సంస్థలు, విద్యా, వైద్య సంస్థలు చదువుకున్న వారి చేతిలో లేవని, కేవలం పెట్టుబడిదారుల చేతుల్లో మాత్రమే ఉన్నాయని, అందుకే సమాజంలో ఇటు పత్రికలకు అటు జర్నలిస్టులకు విలువలు లేకుండా పోయాయని విమర్శించారు. గతంలో పత్రికలు నిజాలు మాత్రమే రాసేవని, పత్రికలో అగ్గిపెట్టెంత వార్త వస్తే ఎంతో స్పందన వచ్చేదని, ప్రస్తుతం నిజాలు రాసే పత్రికలు కరువయ్యాయన్నారు. సమాజం కోసం నిరంతరం శ్రమించే జర్నలిస్టులకు సంక్షేమ ప్రయోజనాలు సమకూర్చకపోవడం దారుణమన్నారు. సమాజంలో ప్రతి ఒక్క రంగానికి ఏదో ఒక లబ్ధి చేకూరుస్తున్న ప్రభుత్వాలు జర్నలిస్టుల సంక్షేమాన్ని విస్మరించడం చాలా బాధాకరమన్నారు. నిరంతరం ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించడంలో ముందున్న జర్నలిస్టులు తమ సమస్యలను తాము పరిష్కరించుకోవడంలో విఫలమవుతున్నారన్నారు. జర్నలిస్టులకు భూములేవు, జాగలు లేవు, హెల్త్ కార్డులు లేవు, సంక్షేమ పథకాలు లేవని అన్నారు. ప్రతి ఒక్క జర్నలిస్టు సంఘటితంగా తమ యూనియన్ల హయాంలో ఉద్యమించి హక్కులను సాధించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రొఫెసర్ గా తనకు జర్నలిస్టుల తో విడదీయరాని అనుబంధం ఉందని, తెలంగాణ ఉద్యమ సమయంలో సైతం జర్నలిస్టులతో కలిసి పోరాడిన సందర్భాలు ఎన్నో ఉన్నాయని, అందుకే జర్నలిస్టుల కష్ట సుఖాలు తనకు తెలుసని పురుషోత్తం అన్నారు. ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ 76వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సీనియర్ పాత్రికేయులను సన్మానించడం అభినందనీయమని, ఇది సమాజంలో మంచి సాంప్రదాయమన్నారు. సమాజానికి విశిష్ట సేవలందించిన సీనియర్ పాత్రికేయులను మర్చిపోకుండా గౌరవించుకోవాలని, ఈ సాంప్రదాయం ఇకముందు కూడా ఇలాగే కొనసాగాలని అన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్య మాట్లాడుతూ, దేశంలో జర్నలిస్టుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న ఏకైక మొదటి యూనియన్ ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం అని అన్నారు. జర్నలిస్టుల రక్షణ కోసం ప్రత్యేక చట్టం సాధన కై దేశవ్యాప్తంగా పోరాడుతుందని, అదేవిధంగా రిటైర్డ్ పాత్రికేయుల కోసం జాతీయ పెన్షన్ పథకం,జాతీయ మీడియా కమిషన్ ఏర్పాటు కోసం ఉద్యమిస్తుందని అన్నారు. ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ సంఘానికి అనుబంధంగా ఉన్న తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో బలోపేతమై త్వరలో జర్నలిస్టుల సమస్యలపై కార్యాచరణ ప్రకటిస్తుందని మామిడి సోమయ్య వెల్లడించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు టి. ఉడయవర్లు, నందిరాజు రాధాకృష్ణ, అద్దంకి శ్రీరామ కుమార్, సిబి లక్ష్మి, యర్రమిల్లి రామారావు తదితరులను ఘనంగా సన్మానించి మెమెంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, నేషనల్ కౌన్సిల్ మెంబర్ కుంచం శ్రీనివాస్, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి.రవి కుమార్, కో- కన్వీనర్లు శ్రీనివాస్ గౌడ్, ఎం. రవికుమార్, రాష్ట్ర నాయకులు పి.ఆనందం, కె.పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

డెలివరీ బాయ్స్ స్థానంలో డ్రోన్లు..

గిగ్ వర్కర్స్‌పై ఏఐ పిడుగు!
లక్షల మంది వీధిన పడే ప్రమాదం



న్యూఢిల్లీ: కృత్రిమ మేధస్సు నిపుణులైన ఉద్యోగులకు ప్రత్యామ్నాయంగా మాత్రమే కాకుండా సాధారణ ఉద్యోగుల ఉసురు తీసేందుకు సైతం సిద్ధమవుతున్నది. అనేక సాఫ్ట్‌వేర్ సంస్థలలో నిపుణులైన సిబ్బందికి ప్రత్యామ్నాయంగా ఇప్పటికే అనేక రంగాలను ఆక్రమిస్తున్న ఏఐ.. త్వరలో డెలివరీ బాయ్స్ స్థానాన్ని కూడా ఆక్ర మించనున్నది. అమెజాన్, జెప్టో, బ్లింకిట్, డిస్ట్రిక్ట్, స్విగ్గీ, జొమాటో వంటి డెలివరీ సంస్థలు.. మనం ఆర్డర్ చేసిన వస్తువులను 10 నిమిషాల్లో మన ఇంటి ముందుకు తెస్తున్నాయి. ఇందుకోసం ఆయా సంస్థలు డెలివరీ బాయ్స్‌ను వినియోగిస్తున్నాయి. కాగా.. ఈ డెలివరీ బాయ్స్ స్థానాన్ని త్వరలో డ్రోన్లు ఆక్రమించనున్నాయి. ఇదే జరిగితే ఈ వృత్తిపై ఆధారపడి ఉపాధి పొందుతున్న కొన్ని లక్షల మంది వీధిన పడే ప్రమాదం పొంచి ఉన్నది. ఇప్పటికే గుర్గావ్, బెంగళూరు వంటి నగరాల్లో వస్తువుల బట్వాడాకు పలు సంస్థలు డ్రోన్లనే వినియోగిస్తున్నాయి. ఉద్యోగులతో పోల్చుకుంటే అత్యంత వేగంగా, అతి తక్కువ ఖర్చుతో డ్రోన్లు పనిచేస్తున్నాయి. అమెజాన్ సంస్థ అమెరికాలోని తన గోదాములలో ఇప్పటికే ఉద్యోగులను తొలగించి వారి స్థానంలో ఏఐతో పనిచేసే రోబోలను ప్రవేశపెట్టింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సైతం ఈ యాంత్రీకరణకు మద్దతునిస్తున్నాయి.

ఉద్యోగ భద్రత లేదు..: డెలివరీ బాయ్స్‌గా పనిచేస్తున్న వారికి ఇప్పటికే ఎటువంటి ఉద్యోగ, ఆరోగ్య భద్రత లేదు, పీఎఫ్ సదుపాయం లేదు. పని మానేసిన రోజున ఎటువంటి బెనిఫి ట్స్ చేతికందవు. రోజుకు12నుంచి 15 గంటలు పని చేస్తున్నా వారికి ఉద్యోగ భద్రత లేదు. ఒక్కరోజు పనికి వెళ్లకపోతే.. ఆ రోజుకు ఎటువంటి భత్యం అందదు. ప్రభుత్వ పథకాలు తెలియవు: దేశంలో కోటిమం దికిపైగా ఉన్న గిగ్ వర్కర్లకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల కొన్ని సదుపాయాలను ప్రకటించింది. ఈ-శ్రమ్ పోర్టల్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వశాఖ సూచి ంచింది. అలా నమోదైన వారికి ఆయుష్మాన్ భారత్, ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన సదుపాయాలను కల్పిస్తామని తెలిపింది. అయితే వీటి గురించి చాలామంది గిగ్ వర్కర్లకు తెలియదని గిగ్ వర్కర్స్ యూనియన్ సమన్వయకర్త నిర్మల్ గొరానా చెప్పారు. వారు తమ రోజువారీ ఉపాధిపైనే దృష్టి కేంద్రీకరిస్తారని ప్రభుత్వ పథకాల గురించి వారికి తెలియదని అన్నారు. వారు పనిచేస్తున్న కంపెనీ వారిని రోడ్డున పడేస్తే,పరిహారం అడిగే హక్కు కూడా వారికి లేదని చెప్పారు.

పర్యాటకం పగటి కలేనా?



నిర్మల్: కాశ్మీర్ వెళ్లే పనిలేదు.. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో విస్తరించి ఉన్న సహ్యాద్రి పర్వత శ్రేణులను చుట్టి వస్తే చాలు.! అంటూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అనేక పర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేసేందుకు పాలకులు ఇస్తున్న హామీలు పగటి కలలుగానే మిగిలిపోతున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అంటేనే సమైక్య ఆంధ్రప్రదేశ్ సహా పక్కనే ఉన్న మహారాష్ట్ర, చత్తీస్‌గడ్, కర్ణాటక రాష్ట్రాలకు ఒక గొప్ప అనుభూతిని ఇచ్చే పర్యాటక జిల్లాగా పేరు ఉంది. ఉన్న పర్యాటక కేంద్రాలను కాస్త అభివృద్ధి చేస్తే దేశంలోనే గొప్ప పర్యాటక జిల్లాగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు కీర్తి వస్తుంది. కానీ, పాలకులు ఆ దిశగా కనీస చర్యలు తీసుకోవడం లేదు. అంతేకాక ఎన్నికల సమయంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని హామీలు ఇస్తున్నా అవికార్యరూపం దాల్చడం లేదు. దీంతో ప్రభుత్వాలు, పాలకులపై జిల్లావాసుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నెన్నో అందాలు...: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అంటేనే అడవుల ఖిల్లాగా పేరు ఉంది. 60శాతం పైగా అడవులు విస్తరించి ఉన్న జిల్లా కావడంతోపాటు అనేక జలపాతాలు, సెలయేరులు జిల్లాలో విస్తరించి ఉన్నాయి. దీనికి తోడు అనేక చారిత్రాత్మక ప్రదేశాలు కూడా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఉండడం విశేషం. అంతటి మహోన్నత ఆదిలాబాద్ జిల్లాను పర్యాటకంగా తీర్చిదిద్దే విషయంలో ఏ ఒక్క ప్రభుత్వం కూడా నిధులు విడుదల చేయడంలో చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఆదిమ గిరిజన ఆరాధ్య దైవం కొమురం భీమ్ జన్మించిన జోడెన్ ఘాట్ అభివృద్ధికి ప్రభుత్వం నిధులు విడుదల చేసినప్పటికీ పూర్తిస్థాయిలో ఇంకా ఆచరణకు నోచుకోలేదు. మ్యూజియం పనులు మినహా ఇతర అభివృద్ధి పనులు జరగడం లేదు. ఆ ప్రాంతానికి ఉట్నూరు లేదా ఆసిఫాబాద్ మీదుగా కెరామెరి ఘాట్స్ మీదుగా వెళ్తే కాశ్మీర్ వెళ్లినట్లే. అలాగే ఆదిలాబాద్ జిల్లాలోని కుంటాల, పొచ్చెర, గాయత్రి జలపాతాలు కనువిందు చేస్తాయి. జైనాథ్ సూర్య దేవాలయం, నాగోబా ఆలయం, ఉట్నూర్ గోండుల జిల్లా, సిర్పూర్ పేపర్ మిల్లు, సింగరేణి కోల్ మైన్స్, బాసర అమ్మవారి క్షేత్రం, నిర్మల్ కొయ్య బొమ్మలు, కడెం కవ్వాల్ అభయారణ్యం ఇలా చెప్పుకుంటూ పోతే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కనీసం 20కి పైగా మంచి పర్యాటక కేంద్రాలు ఉన్నాయి. వీటిని తీర్చిదిదితే కనీసం మూడు నుంచి నాలుగు రోజులపాటు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పర్యాటకులు గడపడంతోపాటు, మంచి అనుభూతిని పొందే అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వాల ఉదాసీనత కారణంగా ఉమ్మడి జిల్లాలో పర్యాటకం పడకేస్తున్నది. గత ప్రభుత్వంలో సీఎం కేసీఆర్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పర్యాటక రంగం అభివృద్ధికి రూ.100కోట్లు ఖర్చు చేస్తామని హామీ ఇచ్చారు. కానీ అది ఉట్టిదేనని తేలిపోయింది.

ఆ తర్వాత సీఎం రేవంత్ రెడ్డి సైతం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఉన్న పర్యాటక కేంద్రాల అభివృద్ధిపై సమీక్ష జరిపారు. గతంలో మాదిరిగా కాకుండా తాము కచ్చితంగా పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు. ఉమ్మడి జిల్లాకు చెందిన 10మంది ఎమ్మెల్యేలు, పార్లమెంటు సభ్యులు రాజకీయాలను పక్కనపెట్టి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉమ్మడి ఆదిలాబాద్ ఇన్చార్జి మంత్రి పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసి నిధుల మంజూరుకు ఒత్తిడి చేస్తే కచ్చితంగా నిధులు మంజూరయ్యే అవకాశాలు ఉన్నాయి. ఆ దిశగా ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజలు కోరుతున్నారు.

డిజిటల్ జనగణనలో
ఓబీసీలకు ప్రత్యేక గుర్తింపు ఏదీ?

- రిజర్వేషన్లకు రాజ్యాంగ సవరణలు.. ఓబీసీల జనాభా గణనకు ఎందుకీ నిర్లక్ష్యం?- అఖిలపక్ష సమావేశంలో జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి డిమాండ్



హైదరాబాద్ (డీకే చాటింపు)దేశంలో ఓబీసీల జనాభా ఎంత ఉందో కచ్చితంగా తెలియకుండా సామాజిక న్యాయం ఎలా సాధ్యమవుతుంది? ఆర్థికంగా బలహీన వర్గాలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ సవరణ చేపట్టింది. మరి దేశంలోని బీసీలకు వారి జనాభా ప్రాతిపదికన న్యాయం చేసేందుకు ఎందుకు అదే స్థాయిలో చొరవ చూపడం లేదు?" అని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు, బీసీ రిజర్వేషన్ల సాధన సమన్వయ జేఏసీ చైర్మన్ దుండ్ర కుమారస్వామి ప్రశ్నించారు. అఖిలపక్ష సమావేశంలో మాట్లాడుతూ, 2027 డిజిటల్ జనగణనలో ఓబీసీ కులాల నమోదుకు ప్రత్యేక డ్రాప్‌డౌన్ మెనూ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై సుప్రీంకోర్టు సంబంధిత అధికారులను ఆశ్రయించేందుకు అవకాశం కల్పించిన నేపథ్యంలో, కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన విధాన నిర్ణయం ప్రకటించాలని కోరారు. "జనగణనలో ఓబీసీ కులాల వారీ వివరాలు సేకరిస్తేనే వారి వాస్తవ జనాభా, విద్యా--ఉద్యోగ ప్రాతినిధ్యం, సామాజిక పరిస్థితులపై సమగ్ర అవగాహన వస్తుంది. ఆ గణాంకాల ఆధారంగానే రిజర్వేషన్లు, సంక్షేమ పథకాలు, రాజకీయ ప్రాతినిధ్యం, అభివృద్ధి కార్యక్రమాలపై సమర్థవంతమైన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుంది. కులాల పేర్ల నమోదుకు ప్రత్యేక డ్రాప్‌డౌన్ మెనూ ఏర్పాటు చేస్తే ఏకరూపత పెరిగి గణాంకాల విశ్వసనీయత మెరుగుపడుతుంది. కేంద్ర ప్రభుత్వం ఈ అంశాన్ని కేవలం సాంకేతిక లేదా పరిపాలనా సమస్యగా చూడకుండా, కోట్లాది మంది వెనుకబడిన వర్గాల హక్కులకు సంబంధించిన అంశంగా పరిగణించాలి" అని ఆయన పేర్కొన్నారు. "రాజ్యాంగం అందరికీ సమానత్వం, సామాజిక న్యాయం కల్పించాలని నిర్దేశిస్తోంది. అలాంటప్పుడు ఓబీసీల జనాభా గణన, వారి హక్కుల సాధన విషయంలోనూ కేంద్ర ప్రభుత్వం, సంబంధిత సంస్థలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. సుప్రీంకోర్టు సహా ఉన్నత న్యాయవ్యవస్థ నుంచి కూడా వెనుకబడిన వర్గాల హక్కులను బలోపేతం చేసే స్పష్టమైన మార్గదర్శకాలు రావాలని ఆశిస్తున్నాం. డిజిటల్ జనగణనలో ఓబీసీలకు తగిన గుర్తింపు కల్పించడం ద్వారా భవిష్యత్తులో విద్య, ఉద్యోగాలు, రాజకీయాలు, సామాజిక రంగాల్లో న్యాయమైన ప్రాతినిధ్యానికి పునాది వేయాలి. ఓబీసీల జనాభా గణనపై కేంద్రం తక్షణమే స్పష్టత ఇచ్చి, సామాజిక న్యాయం దిశగా కార్యాచరణ ప్రకటించాలి" అని దుండ్ర కుమారస్వామి అఖిలపక్ష సమావేశంలో డిమాండ్ చేశారు.

ఊడ్చే యంత్రాలతో ఖజనా ఊడ్చేశారు...

హైదరాబాద్, : సాధారణంగా పారిశుధ్యానికి నగరపాలక సంస్థలు భారీగా ఖర్చు పెడుతుంటాయి. ఒకప్పుడు పారిశుద్ధ్య నిర్వహణ మొత్తం మనుషులు చేసేవారు. అయితే నగరాలు విస్తరించడం వల్ల.. శివారు ప్రాంతాలు పెరిగిపోవడం వల్ల పారిశుద్ధ్య నిర్వహణ మనుషుల వల్ల కావడం లేదు. అందుకే నగరపాలక సంస్థలు చెత్త ఊడ్చడానికి ఖరీదైన యంత్రాలను అందుబాటులోకి తీసుకొస్తున్నాయి. వీటిని కొనుగోలు చేయాలంటే భారీగా డబ్బులు కావాలి. అందువల్లే అవి అద్దె ప్రాతిపదికన తీసుకొస్తుంటాయి. ఇంతవరకు బాగానే ఉన్నా.. ఇప్పటికి చెల్లించే అదే భారీగా ఉంటున్నది. వాస్తవానికి ఆ స్థాయిలో చెల్లించే అద్దె ద్వారా కొత్త యంత్రాలు కొనుగోలు చేయవచ్చు. కానీ నగరపాలక సంస్థల్లో వ్యవహారం వేరే విధంగా ఉంటుంది కాబట్టి వందల కోట్లలో అద్దె చెల్లించడానికి సిద్ధంగా ఉంటారు.మనదేశంలో ప్రఖ్యాత నగరపాలక సంస్థల్లో బెంగళూరు ఒకటి. బెంగళూరు నగరం మనదేశ ఐటీ రాజధానిగా పేరుపొందింది. ఇక్కడ అనేక బహుళజాతి సంస్థలు కార్యకలాపాలు సాగిస్తున్నాయి. గతంతో పోల్చి చూస్తే బెంగళూరు నగరం కూడా విపరీతంగా పెరిగింది. పెరిగిన నగరానికి తగ్గట్టుగానే సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత నగరపాలక సంస్థ మీద పడింది. వాస్తవానికి బెంగళూరులో రోడ్లు చాలా చిన్నవిగా ఉంటాయి. ఇక సాయంత్రం పూట ట్రాఫిక్ చెప్పాల్సిన పనిలేదు. వర్షం కురిస్తే మాత్రం నరకం కనిపిస్తుంది. బెంగళూరులో ప్రతిరోజు చెత్త భారీగా పోగుపడుతుంది. ఇలా పోగు పడిన చెత్తను శుభ్రం చేయాలంటే కార్మికులకు తలకు మించిన భారమవుతోంది. ఏటికేడు ఈ సమస్య పెరిగిపోతున్న నేపథ్యంలో నగరపాలక సంస్థ ఒక కీలక నిర్ణయం తీసుకుంది. అయితే ఈ నిర్ణయం 613 కోట్ల విలువైనది. ఇంతటి డబ్బు పెట్టి కొత్త యంత్రాలు కొనుగోలు చేస్తున్నారనుకుంటే పొరపాటే.బెంగళూరు నగరపాలక పరిధిలో చెత్తను శుభ్రం చేయడానికి.. రోడ్లను ఊడ్చడానికి ఏకంగా 46 స్వీపింగ్ యంత్రాలను బెంగళూరు నగరపాలక సంస్థ అధికారులు అద్దెకు తీసుకున్నారు.

ఏడు సంవత్సరాలపాటు ఈ యంత్రాలను వాడుకునే విధంగా ఒప్పందాలు కుదుర్చుకున్నారు. వాస్తవానికి కర్ణాటక రాజధాని అయిన బెంగళూరు నగరంలో పారిశుద్ధ్యాన్ని పరిరక్షించడానికి తీసుకున్న నిర్ణయం అభినందనీయమైనప్పటికీ.. ఇంతటి ఖర్చుపెట్టి.. అది కూడా యంత్రాలను అద్దెకు తీసుకోవడం ఎంతవరకు సమంజసం అని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్ పరిపాలనలో ఇలాంటివి సహజమేనని వ్యాఖ్యానిస్తున్నారు.

ప్రభుత్వ సూచనలను పట్టించుకొని స్థానిక ప్రజాప్రతినిధులు

జనగామ / పాలకుర్తి అక్టోబర్ 28 డీకే చాటింపు జిల్లా ప్రతినిధి రాబోయే ఎనిమిది నెలలు ఎల్ నీనో ప్రభావంతో రాష్ట్రంలో తీవ్రనీటి ఎద్దడి ఎదుర్కోవాల్సి వస్తుందని నీటిని పొదుపుగా వాడుకుంటూ జాగ్రత్తలు వహించాలని ప్రభుత్వం ప్రతిరోజు ఆయా శాఖల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నప్పటికీ స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులు పెడచెవిన పెడుతున్నారు. జనగామ జిల్లా పాలకుర్తి మండలం శాతపురం గ్రామంలో ప్రభుత్వ సూచనలు పట్టించుకోకుండా మా రూటే సపరేటు అన్నట్లుగా ఆ గ్రామ పంచాయతీ అధికారులు ప్రజాప్రతినిధులు వ్యవరిస్తున్నారని గ్రామస్థులు తెలిపారు. గత 15 రోజులుగా బస్టాండ్ సమీపంలో మంచినీళ్ల పైపు లికేజీ అయి బస్టాండ్ ప్రధాన రహదారి నుండి స్కూలు వరకు ఉదయం 3 పేస్ కరెంటు వచ్చినప్పటి నుండి సాయంత్రం వరకు వరదల పారుతూ నీళ్లు వృధాగా పోతున్నప్పటికీ పట్టించుకోవడం లేదని వారు వివరించారు.ఇప్పటికైనా మండల అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని పైపు లీకేజీ మరమ్మతులు చేయించి నీళ్లు వృధాగా పోకుండా అరికట్టాలని గ్రామస్తులు కోరారు.

మచ్చబొల్లారంలో
సీసీ రోడ్లు, డ్రైనేజీ పనుల ప్రారంభం



మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా(డీకే చాటింపు):
మల్కాజ్‌గిరి నియోజకవర్గ పరిధిలోని మచ్చ బొల్లారంలో రూ.48 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. భారతి ఆవాస్ ప్రెసిడెన్సీ అవెన్యూలోని తేజా ప్రైడ్ అపార్ట్‌మెంట్ పక్కన సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.16 లక్షలు, మచ్చ బొల్లారంలోని
బీఆర్‌రావు నగర్, ఫాదర్ బాలయ్య నగర్ సమీపంలో డ్రైనేజీ పనులకు రూ.10 లక్షలు, మచ్చ బొల్లారంలోని వజ్ర ఎన్‌క్లేవ్‌లో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.22 లక్షలు ఖర్చు చేయనున్నారు. నియోజకవర్గంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు మెరుగైన రహదారులు, డ్రైనేజీ వసతులు కల్పించే దిశగా ఈ పనులను ప్రారంభించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

బీజేపీ పెద్దలకు దగ్గరవుతున్న చంద్రబాబు



విజయవాడ, : ఏపీ సీఎం చంద్రబాబుకేంద్ర పెద్దల వైఖరి పూర్తిగా మారిపోయిందని చెప్పవచ్చు. 2024 ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత చంద్రబాబు ప్రాధాన్యం కేంద్రంలో పెరిగింది. దానికి కారణం ఎన్డీఏలో కీలక భాగస్వామిగా ఉండి.. మోదీ మూడోసారి ప్రధాని అయ్యేందుకు అవసరమైన సంఖ్యా బలాన్ని అందించగలిగింది తెలుగుదేశం పార్టీ. అయితే గత అనుభవాల దృష్ట్యా చంద్రబాబు కేంద్ర పెద్దలతో చాలా సఖ్యతగా మెలుగుతూ వచ్చారు. గతానికి భిన్నంగా వ్యవహరిస్తున్నారు. ఏ విషయంలోనూ గాబరా పడటం లేదు. కేంద్రంతో ఇబ్బందులు తెచ్చుకునే పరిస్థితి లేదు. అయితే ఈ కేంద్ర పెద్దలతో నమ్మదగని మిత్రుడు అనిపించుకున్నారో.. అదే పెద్దలతో శభాష్ అంటూ చప్పట్లు కొట్టించుకుంటున్నారు. విశాఖ పెట్టుబడుల సదస్సులో అయితే కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ చంద్రబాబుకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

జనసేన తీర్థానికి వైఎస్ఆర్‌సీపీ సీనియర్ల దూరమా?



ఒంగోలు : ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్ఆర్‌సీపీ ప్రాధాన్యం క్రమంగా తగ్గుతున్న క్రమంలో, ఆ పార్టీకి చెందిన పలువురు సీనియర్ నాయకులు గుడ్‌బై చెబుతూ కొత్త దారులు వెతుక్కుంటున్నారు. విజయనగరం జిల్లా జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు వైఎస్ఆర్‌సీపీకి రాజీనామా చేసిన వెంటనే నేరుగా టీడీపీ గూటికి చేరడం చర్చనీయాంశం అయింది. ప్రతిపక్షం నుంచి బయటకు వస్తున్న నేతలకు కూటమి రూపంలో రెండు వేదికలు అందుబాటులో ఉన్నప్పటికీ, మెజారిటీ నాయకులు జనసేన వైపు చూడకుండా కేవలం తెలుగుదేశం వైపే మొగ్గు చూపడానికి ఆసక్తి చూపిస్తున్నారు. ఈ పరిస్థితికి ప్రధాన కారణం జనసేనలో చేరిన తర్వాత లభిస్తుందనుకున్న ప్రాధాన్యత పై రాజకీయ నేతలకు ఉన్న అనుమానాలే. వైఎస్ఆర్‌సీపీ నుంచి బయటకు వచ్చి జనసేన తీర్థం పుచ్చుకున్న మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఉదంతం ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణగా నిలుస్తోంది. రాయలసీమ , ప్రకాశం జిల్లా రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం ఉన్న బాలినేని వంటి సీనియర్ నేత జనసేనలో చేరినప్పటికీ, ఆయనకు క్షేత్రస్థాయిలో ఆశించిన స్థాయిలో ప్రాధాన్యత లభించడం లేదనే అభిప్రాయం ఉంది. పైగా ఒంగోలు పరిసర నియోజకవర్గాల్లో కూటమి భాగస్వామి అయిన టీడీపీ స్థానిక నేతలతో బాలినేనికి తరచూ విభేదాలు రావడం, కూటమి శ్రేణుల మధ్య ఘర్షణలు వాతావరణం నెలకొనడం వంటివి ఆయనకు మరింత ఇరకాటంగా మారాయి.జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పార్టీ విషయంలో అనుసరిస్తున్న కఠినమైన ఫిల్టరింగ్ విధానం కూడా ఈ వలసల వేగాన్ని తగ్గించింది. అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీలోకి వచ్చే వారి విషయంలో పవన్ జాగ్రత్తలు వహిస్తున్నారు. గతంలో జనసేనను, పవన్ కళ్యాణ్‌ను వ్యక్తిగతంగా తీవ్రస్థాయిలో విమర్శించిన వైఎస్ఆర్‌సీపీ నేతలను, ,నియోజకవర్గాల్లో వివాదాస్పద ఇమేజ్ ఉన్న వారిని పార్టీలోకి చేర్చుకోవడానికి ఆయన సుముఖంగా లేరు. దీంతో పార్టీలోకి రావాలని ఆశపడే నేతలకు కనీసం గ్రీన్ సిగ్నల్ కూడా లభించని పరిస్థితి నెలకొంది. అధికారిక ప్రాధాన్యత , నియోజకవర్గాల్లో పట్టు సాధించే క్రమంలో టీడీపీయే సరైన వేదిక అని జంపింగ్ నేతలు భావిస్తున్నారు. పాత వైఎస్ఆర్‌సీపీ నేతలకు నియోజకవర్గ స్థాయి వ్యవస్థలపై, అధికారులపై ప్రభావం చూపగలిగే బలమైన కేడర్ అవసరం. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని టీడీపీకి గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు బలమైన యంత్రాంగం ఉంది. జనసేన ఓటు బ్యాంకు బలమైనదే అయినప్పటికీ, నియోజకవర్గంలో రాజకీయం నడపాలంటే టీడీపీ అధికారిక చక్రం కింద ఉండటమే రక్షణ అని సీనియర్ నాయకులు లెక్కింపులు వేస్తున్నారు.జనసేన అంతర్గత నిర్మాణం, నిర్ణయాల ప్రక్రియ కూడా ఇక్కడ ఒక అంశంగా మారింది. పవన్ కళ్యాణ్ చుట్టూ ఉన్న కోటరీ , పరిమితమైన పార్టీ పదవుల కేటాయింపు వల్ల, కొత్తగా చేరే వైఎస్ఆర్‌సీపీ మాజీ సీనియర్లకు సముచిత స్థానం దక్కుతుందా లేదా అనే సంశయం ఉండిపోయింది. బాలినేని శ్రీనివాసరెడ్డి ఉదంతాన్ని చూసిన తర్వాత చాలామంది వైఎస్ఆర్‌సీపీ సీనియర్లు జనసేనలోకి వెళ్లి మూలన పడేకంటే, నేరుగా టీడీపీలోకి వెళ్లి తమ ఉనికిని చాటుకోవడమే మేలు అనే ముగింపునకు వచ్చినట్లు కనిపిస్తోంది. ఈ పరిణామాలు క్షేత్రస్థాయిలో జనసేన విస్తరణకు కొంత అడ్డంకిగా మారినప్పటికీ, స్వచ్ఛమైన ఇమేజ్ ఉన్నవారినే పార్టీలోకి తీసుకోకూడదనే పవన్ కళ్యాణ్ వ్యూహం సుదీర్ఘకాలంలో పార్టీ సిద్ధాంతానికి మేలు చేస్తుందని జనసేన వర్గాలు వాదిస్తున్నాయి. అయితే, ప్రతివక్ష వైఎన్ఆర్‌సీపీ బలహీనపడుతున్న ఈ కీలక సమయంలో వలసొచ్చే బలమైన నేతలను ఆకర్షించడంలో జనసేన వెనుకబడితే, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని నిర్మించుకోవడం ఆ పార్టీకి అతిపెద్ద సవాలుగా మారే అవకాశముంది.

లోకల్ పోల్స్‌కు కాంగ్రెస్ రెడీ..!



విజయవాడ, : ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సుదీర్ఘకాలంగా సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న కాంగ్రెస్ పార్టీ, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను వేదికగా చేసుకుని పూర్వవైభవం సాధించేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సారథ్యంలో పార్టీని క్షేత్రస్థాయి నుంచి పునర్నిర్మించే క్రమంలో 10 మంది సీనియర్ నేతలతో కూడిన రాష్ట్ర స్థాయి మానిటరింగ్ కమిటీ ని ఏర్పాటు చేయడం ఆసక్తికరంగా మారింది. ఈ కమిటీకి సీడబ్ల్యూసీ సభ్యుడు, మాజీ పీసీసీ చీఫ్ ఎన్. రఘువీరారెడ్డిని ఛైర్మన్‌గా, మాజీ కేంద్ర మంత్రి జేడీ శీలంను కన్వీనర్‌గా నియమించడం ద్వారా కాంగ్రెస్ తన పాత కాపులను, అనుభవజ్ఞులను మళ్లీ ప్రధాన స్రవంతిలోకి తెచ్చేందుకు తగిన వేదికను సిద్ధం చేసింది.ఈ తాజా నియామకాల్లో ప్రధానంగా ఆకట్టుకుంటున్న అంశం రఘువీరారెడ్డి రీ-ఎంట్రీ. రాష్ట్ర విభజన అనంతరం అత్యంత క్లిష్టమైన పరిస్థితుల్లో పీసీసీ అధ్యక్షుడిగా పార్టీని నడిపిన ఆయన, గత కొంతకాలంగా ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉంటూ ఆధ్యాత్మిక, వ్యవసాయ కార్యక్రమాలకే పరిమితమయ్యారు. అయితే, రాయలసీమతో పాటు రాష్ట్రవ్యాప్తంగా వివాదరహిత నాయకుడిగా, సౌమ్యుడిగా ఆయనకున్న మంచి పేరును వాడుకోవాలని ఏఐసీసీ భావించింది. బిసి, యాదవ సామాజిక వర్గానికి చెందిన సీనియర్ నేతగా, ఉమ్మడి ఏపీలో కీలక మంత్రిత్వ శాఖలు నిర్వహించిన రఘువీరారెడ్డి నాయకత్వం.. సైలెంట్‌గా ఉన్న పాత కాంగ్రెస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపే అవకాశం ఉంది.ఈ 10 మంది సభ్యుల కమిటీ ప్రాథమిక విధి కేవలం టికెట్ల కేటాయింపు లేదా కార్యాలయ వ్యవహారాలకే పరిమితం కాదు. సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు, మాజీ కేంద్ర మంత్రులు పల్లంరాజు, కిల్లి కృపారాణి, తులసిరెడ్డి, షేక్ మస్తాన్ వలి వంటి దిగ్గజాలతో కూడిన ఈ బృందం త్వరలోనే జిల్లాల పర్యటనలకు శ్రీకారం చుట్టనుంది. గత కొన్నేళ్లుగా వైసీపీ, టీడీపీల వైపు వెళ్లిన ద్వితీయ శ్రేణి నేతలను, కాంగ్రెస్‌తో అనుబంధం ఉన్న పాత కుటుంబాలను పరామర్శించడం, తీవ్ర అసంతృప్తితో ఉన్న క్షేత్రస్థాయి శ్రేణులను తిరిగి సొంత గూటికి రప్పించడమే ఈ కమిటీ ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది.రాజకీయ సమీకరణాల పరంగా చూస్తే, ప్రస్తుతం ఏపీలో తీవ్రమైన అధికార-ప్రతిపక్ష పోరు నెలకొంది. ఓవైపు వైఎస్ఆర్‌సీపీ తమ అభ్యర్థులను నిలబెట్టేందుకు కష్టపడుతున్న తరుణంలో, మరోవైపు కూటమి ప్రభుత్వంపై ఉండే సహజ వ్యతిరేకతను లేదా తటస్థ ఓటు బ్యాంకును ఆకర్షించడానికి కాంగ్రెస్‌కు ఇది అనుకూల సమయం. స్థానిక సంస్థల పోరులో పంచాయతీ, మండల, మున్సిపల్ స్థాయిలో బహుముఖ పోటీని సృష్టించడం ద్వారా, రాష్ట్రంలో కనీసం 10 నుండి 15 శాతం ఓటు బ్యాంకును తిరిగి సాధించవచ్చని పార్టీ అంచనా వేస్తోంది. వైఎస్సార్ వారసత్వం కార్డ్‌ను షర్మిల వాడుతుండగా, పాత కాంగ్రెస్ పునాదుల ను రఘువీరా బృందం బలోపేతం చేసే ప్రయత్నం చేస్తోంది.కాంగ్రెస్ బాటలో సవాళ్లు తక్కువగానేమీ లేవు. క్షేత్రస్థాయిలో పార్టీకి ఆర్థికంగా, అంగబలంతో అండగా నిలిచే నాయకత్వం దాదాపు కనుమరుగైంది. ఎన్నికల నిర్వహణ వ్యయం విపరీతంగా పెరిగిన నేపథ్యంలో, గెలుపు గుర్రాలను వెతికి పట్టుకోవడం ఈ కమిటీకి అతిపెద్ద అగ్నిపరీక్ష. అలాగే రఘువీరారెడ్డి సుదీర్ఘ విరామం తర్వాత క్షేత్రస్థాయిలో ఎంతవరకు పర్యటించి, నేతలలో ఆత్మవిశ్వాసాన్ని నింపగలరనేది కూడా కీలకం. ఏది ఏమైనా, సరైన వ్యూహం లేకుండా ఎన్నికలకు వెళ్లే విధానానికి స్వస్తి పలికి, ముందుగానే పక్కా కసరత్తు ప్రారంభించడం కాంగ్రెస్ సాధించిన సానుకూల పరిణామంగానే చెప్పాలి.రఘువీరారెడ్డి నేతృత్వంలోని ఈ హైపవర్ కమిటీ ఏపీ కాంగ్రెస్‌కు ఎంతవరకు సంజీవని గా మారుతుందో వేచి చూడాలి. అధికారంలో ఉన్న కూటమిని, ప్రధాన ప్రతిపక్షమైన వైఎస్ఆర్‌సీపీని తట్టుకుని స్థానిక పోరులో స్థానాలు గెలుచుకుంటేనే 2029 సార్వత్రిక ఎన్నికల నాటికి ఏపీలో కాంగ్రెస్ పునరుజ్జీవనానికి పునాది పడుతుంది.

సర్-2026 పై రాజకీయ పార్టీల సంతృప్తి..!

రాయచోటి: అన్నమయ్య జిల్లాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సర్-2026లో భాగంగా చేపట్టిన ఓటర్ల జాబితా పునఃసమీక్ష ప్రక్రియపై రాజకీయ పార్టీల ప్రతినిధులు సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో సర్ ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనల మేరకు నిర్వహించారని, తమకు ఎటువంటి అభ్యంతరాలు లేవని వారు పేర్కొన్నారు.గురువారం మదనపల్లె కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ కె.వి.ఎన్. చక్రధర్ బాబు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సర్ 2026పై సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఇప్పటివరకు చేపట్టిన ఎఫ్ఐ ప్రక్రియ, ఓటర్ల జాబితా సవరణ, దరఖాస్తుల పరిశీలన తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు.ఈ సందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ.. గతంలో సర్ ప్రక్రియపై తమకు ఉన్న పలు సందేహాలు, అపోహలు ప్రస్తుతం నివృత్తి అయ్యాయని, అధికారులు ప్రతి దరఖాస్తును పరిశీలించి సమస్యలను పరిష్కరించేందుకు సానుకూలంగా స్పందించారని తెలిపారు. ముఖ్యంగా బూత్ లెవల్ అధికారుల క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా పనిచేశారని వారు పేర్కొన్నారుజిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో. సర్ ప్రక్రియలో అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి ప్రక్రియను విజయవంతంగా ముందుకు తీసుకెళ్లారని, తమకు ఎటువంటి అభ్యంతరాలు లేదా సందేహాలు లేవని రాజకీయ పార్టీల ప్రతినిధులు సమావేశంలో తెలిపారుఈ సందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ... అన్ని రాజకీయ పార్టీలు బిఎల్ఓ లను తప్పనిసరిగా నియమించుకోవాలన్నారు. బి ఎల్ ఓ మరియు బిఎల్ఎ కలిసి సమన్వయంగా కృషి చేస్తే ఓటర్లకు మంచి సేవలు అందించగలుగుతామని, అదేవిధంగా ఎలాంటి తప్పులు లేని ఓటర్ల జాబితా రూపొందించగలుగుతామన్నారు. క్లెయిమ్స్ అండ్ అబ్జెక్షన్స్ పరిష్కారంలో రాజకీయ పార్టీలు పూర్తిగా సహకారం అందించాలని కోరారు సర్ ప్రక్రియలో మిగిలి ఉన్న పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గతంలో జరిగిన సమావేశాల్లో గుర్తించిన అంశాలతో పాటు ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న పనులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారుఅడిషన్లు, డిలీషన్లు, పెండింగ్ దరఖాస్తులు పరిష్కారంలో మరోసారి పరిశీలించి ఎలాంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని, అవసరమైన చోట సంబంధిత రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమన్వయం చేసుకుని ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.సమావేశంలో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ... సర్-2026లో మిగిలిన పనులను రాజకీయ పార్టీలతో అధికారులు సమన్వయం చేసుకొని ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. చివరి దశలో చిన్నపాటి పొరపాట్లకు కూడా అవకాశం లేకుండా ప్రతి కేసును, ప్రతి దరఖాస్తును, సంబంధిత రికార్డులను మరోసారి క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు వ్యక్తం చేసిన సూచనలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల జాబితా ప్రక్రియలో పారదర్శకత, ఖచ్చితత్వం, విశ్వసనీయతకు ప్రాధాన్యత ఇస్తూ మిగిలిన పనులను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ, సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్ఓ వెంకటేష్, నియోజకవర్గ ఈఆర్ఓలు శ్రీనివాస్, చంద్రశేఖర్ రెడ్డి, మాధవ కృష్ణారెడ్డి, నారాయణరెడ్డి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.స్పెషల్ ఇంటెన్సివ్ రివిజ2026లో భాగంగా జిల్లాలో చేపట్టిన ఎలక్టోరల్ రోల్ ప్రక్రియను పారదర్శకంగా, విజయవంతంగా, విశ్వసనీయంగా పూర్తి చేయాలని జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ కె.వి.ఎన్. చక్రధర్ బాబు ఈఆర్ఓలు, తాసిల్దార్లను, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు గురువారం మదనపల్లె కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో... జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లాలో నిర్వహిస్తున్-2026పై ఈఆర్ఓలు, తాసిల్దార్లను, మున్సిపల్ కమిషనర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

సమన్వయం సాధించేది ఎలా!



శ్రీకాకుళం : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం ప్రతిపక్ష పాత్రలో కొనసాగుతోంది. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి) నేతృత్వంలో పార్టీ కార్యకలాపాలు సాగుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలు, అంతర్గత విభేదాలు, నాయకుల మధ్య సమన్వయం వంటి అంశాలు రాజకీయ చర్చకు కారణమవుతున్నాయి. ఇటీవల పార్టీ అంతర్గత వ్యవహారాలపై పలువురు నేతలు చేస్తున్న వ్యాఖ్యలు కూడా ఈ చర్చకు మరింత ప్రాధాన్యం తీసుకొచ్చాయి.వైసీపీలో జగన్ తర్వాత పార్టీ వ్యవహారాలను నిర్వహించే విధానం గురించి చాలాకాలంగా రాజకీయ వర్గాల్లో భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం సజ్జల రామకృష్ణారెడ్డి రాష్ట్ర సమన్వయకర్తగా పార్టీ కార్యక్రమాల్లో కీలకంగా వ్యవహరిస్తున్నారు. 2026లో ఆయన ప్రాంతీయ సమన్వయకర్తలు, జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌చార్జులతో సమావేశాలు నిర్వహిస్తూ పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నట్లు వైసీపీ అధికారిక ప్రకటనలు కూడా వెల్లడిస్తున్నాయి.అయితే పార్టీకి సంబంధించిన నిర్ణయాలు క్షేత్రస్థాయి నాయకులు, కార్యకర్తలకు ఎంత వేగంగా చేరుతున్నాయి? వారి అభిప్రాయాలు అధిష్ఠానానికి ఎంతవరకు చేరుతున్నాయి? అనే ప్రశ్నలు మాత్రం కొనసాగుతున్నాయి. ఒక రాజకీయ పార్టీ బలంగా ఉండాలంటే అధ్యక్షుడికి క్షేత్రస్థాయి పరిస్థితులపై ప్రత్యక్ష సమాచారం అందడం, నాయకులతో నిరంతర సంప్రదింపులు ఉండటం కీలకంగా మారుతుంది. ముఖ్యంగా ఎన్నికల పరాజయం తర్వాత పార్టీ నిర్మాణాన్ని పునర్వ్యవస్థీకరించుకోవాల్సిన పరిస్థితిలో ఈ అంశాలకు మరింత ప్రాధాన్యం ఉంటుంది.ఇక జిల్లాల స్థాయిలో కనిపిస్తున్న విభేదాలు వైసీపీకి మరో సవాలుగా మారుతున్నాయి. శ్రీకాకుళం జిల్లాలో మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం కుమారుడు చిరంజీవి నాగ్ తాజాగా సొంత పార్టీ నేతలపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. జిల్లా పార్టీ వ్యవహారాలపై తన అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ, తమ్మినేని సీతారాంపై వచ్చిన విమర్శలను జిల్లా నాయకత్వం ఖండించకపోవడాన్ని ఆయన ప్రశ్నించారు. ఇదే సమయంలో శ్రీకాకుళం వైసీపీలో అంతర్గత విభేదాలపై చిరంజీవి నాగ్ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చనీయాంశమయ్యాయి. పార్టీకి సంబంధించిన సమస్యలను అధిష్ఠానం నేరుగా పరిశీలించి పరిష్కరించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.ఇలాంటి పరిస్థితుల్లో జగన్‌కు పార్టీపై మరింత ప్రత్యక్ష పర్యవేక్షణ, నాయకులతో విస్తృతంగా సంప్రదింపులు, జిల్లాల వారీగా సమస్యలపై సమీక్షలు అవసరమనే చర్చ జరుగుతోంది. ప్రత్యర్థి పార్టీల వ్యూహాలకు స్పందించడంతో పాటు సొంత పార్టీలోని అసంతృప్తిని ముందుగానే గుర్తించడం కూడా రాజకీయంగా కీలకమే.

అయితే వైసీపీ మాత్రం ప్రస్తుతం కేడర్‌ను బలోపేతం చేయడం, ప్రజా సమస్యలను ప్రస్తావించడం, సంస్థాగత నిర్మాణాన్ని పటిష్టం చేయడంపై దృష్టి పెడుతున్నట్లు అధికారికంగా చెబుతోంది.జగన్ ముందున్న ప్రధాన అంశం పార్టీని మరింత సమర్థవంతమైన సంస్థగా తీర్చిదిద్దడం. నాయకులు, కార్యకర్తలు, నియోజకవర్గ స్థాయి శ్రేణుల నుంచి వచ్చే అభిప్రాయాలను సమగ్రంగా స్వీకరించి, అవసరమైన చోట మార్పులు చేస్తే పార్టీ భవిష్యత్ రాజకీయ కార్యాచరణకు స్పష్టమైన దిశ ఏర్పడే అవకాశం ఉంటుంది.

ఆందోళనకరం...



రాష్ట్రంలో ప్రతి ఏటా ఆత్మహత్యలు పెరుగుతుండటం తీవ్ర ఆందోళనకరం. కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం దేశ వ్యాప్తంగా జరుగుతున్న బలవన్మరణాల్లో ఐదుశాతం ఆంధ్రప్ర దేశ్ నుండే ఉండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. 2014లో 6,101గా ఉన్న ఆత్మహత్యల సంఖ్య 2022 నాటికి 8,908కి పెరిగింది. 2014లో ప్రతి లక్షమంది జనాభాకు 12 ఆత్మహత్య రేటుగా ఉంటే 2022 లో అది 16.8కి పెరిగింది. విజయవాడలో ఒకే ఏడాదిలో 65 శాతం ఆత్యహత్యల పెరుగుదల నమోదు కాగా, విశాఖపట్నంలో 22 శాతం పెరుగుదల కనిపించింది. మరొక అధ్యయనం ప్రకారం ప్రతి ఏడాది రోడ్ ప్రమాదాలతో సమానంగా ఆత్మహత్యలు కూడా జరుగుతున్నాయి. సమైక్యరాష్ట్ర విభజన ముందునాటితో పోలిస్తే ఆ తరువాతే రాష్ట్రంలో ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. 1996-2013మధ్య రోజుకి 20 మంది ఆత్మహత్యలు చేసుకోగా, విభజన తరువాత 2014-2021 మధ్య రోజుకి 41 మంది బలవన్మరణాలకు పాల్పడ్డారు. పాలకులు చెప్పే మాటలు ఎలా ఉన్నప్పటికీ రాష్ట్రం ఏ దిశలో సాగుతుందో చెప్పడానికి ఈ గణాంకాలు ఒక నిదర్శనం. అధికారికంగా కుటుంబ సమస్యలు, వ్యాధులు, అప్పుల బాధలను ఆత్మహత్యలకు కారణాలుగా చెబుతున్నప్పటికీ అసలు కారణం ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలే అని చెప్పకతప్పదు. సరళీకరణ ఆర్థిక విధానాల్లో భాగంగా పాలకవర్గాలు అనుసరిస్తున్న ప్రైవేటీకరణ, కార్పొరేట్ అనుకూల విధానాలు ప్రజల మీద పెనుభారాన్ని మోపుతున్నాయి. దీంతో కుటుంబాలు తీవ్ర స్థాయిలో ఒత్తిడికి గురవుతున్నాయి. ఆత్మహత్యలు చేసుకుంటున్న వారిలో దినసరి కూలీలు, రైతులు, నిరుద్యోగ యువత అధిక సంఖ్యలో ఉన్నారు. 2022లో నమోదైన గణాంకాల ప్రకారమే మొత్తం ఆత్మహత్యల్లో మూడో వంతు ఆత్మహత్యలు రోజువారీ కూలీలవే. ఇది వారి ఆర్థిక అస్థిరత, సామాజిక భద్రతా లోపానికి నిదర్శనం. ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సృష్టించడంలో ప్రభుత్వాల వైఫల్యం యువతపై ప్రభావం చూపుతోంది. అన్నదాతల పరిస్థితి కూడా ఇంతే! పంటలకు గిట్టుబాటుధర లేక, చేసిన అప్పులు తీర్చలేక రైతులు ప్రాణాలు తీసుకుంటున్నారు. వివిధ నివేదికల ప్రకారం 2014లో రాష్ట్రంలో 233 మంది రైతులు ఆత్యహత్యలు చేసుకోగా, 2022 నాటికి ఆ సంఖ్య 524కు చేరింది. ఒకవైపు అప్పులు తీర్చలేక రైతులు ప్రాణాలు తీసుకుంటే, జీవనోపాధి లేక దినకూలీలు ఆత్మహత్యల బాట పడుతున్నారు. విద్యార్థులది మరో విషాద గాధ. 2022 సంవత్సరంలో 575 మంది విద్యార్థులు ప్రాణాలు తీసుకోవడం విద్యా వ్యవస్థలోని క్రూరత్వానికి నిదర్శనం. కార్పొరేట్ విద్యాసంస్థలు ర్యాంకుల కోసం విద్యార్థులపై అమానుష ఒత్తిడి పెడుతున్నాయి. విద్యార్థులలో తీవ్రస్థాయిలో అలజడి చెలరేగినప్పుడు కంటితుడుపు మాటలు చెబుతున్న నేతలు ఆ తరువాత వాటిని విస్మరిస్తుండటం దీనికి కారణం. మత్తు పదార్థాలకు బానిసలైన వారు చేసుకుంటున్న ఆత్మహత్యలు కూడా భారీగా పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తుంది. ఇక 2022లో చోటుచేసుకున్న మొత్తం 8,908 ఆత్మహత్యల్లో 2,141 మహిళలవే! ఈ పరిస్థితి దేనికి నిదర్శనమో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఆత్మహత్యలు వ్యక్తిగత బలహీనతలు కావు. వాటిని ప్రభుత్వాల విధానాలు, సమాజ బలహీనతల ఫలితంగానే చూడాలి! ఆత్మహత్యలకు పాల్పడిన కుటుంబాల పట్ల సానుభూతి చూపడం కన్నా ముందుగా ఆ పరిస్థితి రాకుండా చూడటం అవసరం. ప్రజల ప్రాణాలను కాపాడాలన్న చిత్తశుద్ధి నిజంగానే పాలకులకు ఉంటే ఆ దిశలో అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలి. ముందుగా మానసిక, ఆరోగ్య వసతులను బలోపేతం చేయాలి. హెల్ప్‌లైన్‌లను ఏర్పాటు చేయడంతో పాటు, వాటిపై విస్తృత ప్రచారం చేయాలి. నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సృష్టించాలి.రైతులకు రుణ విముక్తి, ఉపాధి హామీ పనులకు నిధుల పెంపు, కార్మికులకు భద్రత, విద్యార్థులకు ఒత్తిడి రహిత విద్య అందుబాటులోకి తేవాలి. నిజానికి ఇవన్నీ ప్రజల హక్కులే.

ఫ్యాన్ రెక్కలు విలవిల!

విజయనగరం: ఉత్తరాంధ్ర రాజకీయాల్లో వైఎస్ఆర్‌సీపీ ఉనికి ప్రశ్నార్థకంగా మారుతోంది. దీనికి క్షేత్రస్థాయి పరిణామాలు బలం చేకూరుస్తున్నాయి. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో దశాబ్దాల పాటు రాజకీయాన్ని శాసించిన ఉద్దండులైన సీనియర్ నేతలు సైతం ఇప్పుడు వైసీపీ జెండా మోసేందుకు వెనుకంజ వేస్తున్నారు. గత ఎన్నికల్లో అధికార దర్పం, అపరిమితమైన ఆర్థిక బలం, పటిష్టమైన యంత్రాంగం ఉండి కూడా దాదాపుగా ప్రతి నియోజకవర్గంలో 50 వేల ఓట్లకు పైగా భారీ వ్యత్యాసంతో ఓడిపోవడం సదరు నేతల ఆత్మవిశ్వాసాన్ని కోలుకోలేని దెబ్బతీసింది. ఆ ఘోర పరాభవం తర్వాతే అనేకమంది సీనియర్లు సైలెంట్ అయిపోగా, మరికొందరు ఇప్పటికే పార్టీకి గుడ్ బై చెప్పారు.ఉత్తరాంధ్ర సామాజిక సమీకరణాలను, ప్రజల ఆలోచనా ధోరణిని నిశితంగా పరిశీలిస్తే.. వైఎస్ఆర్‌సీపీ మళ్లీ పూర్వవైభవాన్ని పుంజుకోవడం దాదాపు అసాధ్యమనే భావన రాజకీయ వర్గాల్లో బలంగా నాటుకుపోయింది. దీంతో తమ సుదీర్ఘ రాజకీయ అనుభవంతో పరిస్థితిని ముందే అంచనా వేసిన సీనియర్ నాయకులు ఒక వ్యూహాత్మక నిర్ణయానికి వచ్చారు. తాము ప్రత్యక్ష రాజకీయాల నుంచి గౌరవప్రదంగా రిటైర్మెంట్ ప్రకటించడం లేదా క్రియాశీల పాత్ర నుంచి తప్పుకోవడం ఒక మార్గమైతే.. తమ వారసులను, ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని కూటమి పార్టీలైన టీడీపీ లేదా జనసేనలోకి పంపించడం మరో ప్రత్యామ్నాయంగా ఎంచుకుంటున్నారు.ముఖ్యంగా విజయనగరం, విశాఖ జిల్లాల్లో బారీ స్థాయిలో సాగుతున్న ఈ వలసలు కేవలం ఆరంభం మాత్రమే. స్థానిక సంస్థల ఎన్నికల సమయం దగ్గర పడుతుండటంతో ప్రాదేశిక, పురపాలక వర్గాల్లో ఉనికి కాపాడుకోవడానికి స్థానిక నేతలు డిఫెన్స్‌లో పడ్డారు. వైసీపీ గుర్తుపై పోటీ చేస్తే గెలుపు అవకాశాలు శూన్యమని భావిస్తున్న వీరు, కూటమిలోని ఏ పార్టీ తలుపు తడితే ఆ పార్టీలో చేరేందుకు సిద్ధపడుతున్నారు. అధికారంలో ఉన్న కూటమి మద్దతు లేకుండా క్షేత్రస్థాయిలో రాజకీయాలు చేయడం సాధ్యం కాదనే స్పష్టత రావడంతో, క్యాడర్ మొత్తం ఒక్కొక్కటిగా ఖాళీ అవుతోంది.పార్టీ కేంద్రీకృత నాయకత్వ శైలి, ఎన్నికల ఫలితాల తర్వాత కనీస దిశానిర్దేశం లేకపోవడం కూడా ఈ సీనియర్ల నిష్క్రమణకు వేగవంతం చేస్తోంది. ఏ రాజకీయ పార్టీకైనా క్షేత్రస్థాయి నాయకులే ఆయువుపట్టు. కానీ ఉత్తరాంధ్ర వ్యాప్తంగా అగ్రనేతల నుంచి క్షేత్రస్థాయి ప్రసిద్ధ ముఖాల వరకు అందరూ జెండా ఎత్తేస్తుండటంతో వైసీపీ పూర్తిగా దెబ్బతింది. రాబోయే స్థానిక పోరు ముగిసేనాటికి ఉత్తరాంధ్రలో వైఎస్ఆర్‌సీపీ బోర్డు తిప్పేయడం లేదా నామమాత్రపు స్థానానికి పరిమితం కావడం ఖాయంగా కనిపిస్తోంది.ఆయువు పై పట్టు...ఉత్తరాంధ్రలో వైసీపీకి ఊహించని దెబ్బ తగిలింది. వైసీపీకి బొత్స సత్య నారా యణ మేనల్లుడు మజ్జి శ్రీనివాసరావు రాజీనామా చేశారు. చిన్న శ్రీను రాజీనామా ఉత్తరాంధ్ర వైసీపీ రాజకీయాలను కుదిపేసింది. తన రాజీనామా లేఖను చిన్న శ్రీను జగన్ కు పంపారు. వ్యక్తిగత కారణాలతోనే తాను పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు చిన్న శ్రీను ఆ లేఖలో పేర్కొన్

కేంద్రమంత్రులకు చింతన్ బైఠక్



న్యూఢిల్లీ : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర మంత్రి మండలి రెండు రోజుల పాటు అత్యంత కీలకమైన మేధోమథన సదస్సు నిర్వహిస్తోంది. ఢిల్లీలోని ప్రధానమంత్రి కార్యాలయం వేదికగా బుధ, గురువారాలు ఈ భేటీ జరగనుంది. కేబినెట్ మంత్రులు, సహాయ మంత్రులు అందరూ పాల్గొంటున్నారు. వికసిత్ భారత్ రోడ్‌మ్యాప్‌లో భాగంగా ఇప్పటివరకు సాధించిన ప్రగతిని సమీక్షించడంతో పాటు, రాబోయే రోజుల్లో చేపట్టాల్సిన తదుపరి సంస్కరణలు, పాలనా ప్రాధాన్యతలను ఖరారు చేయడమే ఈ సమావేశం ప్రధాన అజెండా అని కేంద్రం ప్రకటించిందిఈ రెండు రోజుల సమావేశంలో ప్రధానమంత్రి ప్రధానంగా నాలుగు కీలక అంశాలపై మంత్రులకు దిశానిర్దేశం చేస్తున్నారు. పథకాల అమలులో వేగం పెంచడం, మంత్రిత్వ శాఖల మధ్య అంతర్గత సమన్వయం , శాఖాపరమైన అవరోధాలు తొలగించడం , సాధారణ ప్రజలకు జీవన సౌలభ్యాన్ని మరింత మెరుగుపరచడం. అంతేకాకుండా, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి ఎలా తీసుకెళ్తున్నారనే అంశంపై మంత్రుల కమ్యూనికేషన్ వ్యూహాలు, డిజిటల్, సోషల్ మీడియా, ప్రజా సమస్యల పరిష్కార నివేదికలపై మంత్రుల పనితీరును ప్రధాని సమీక్షించనున్నారు.ఈ చింతన్ శిబిరం కోసం కేంద్ర మంత్రులను నాలుగు ప్రధాన గ్రూపులుగా విభజించారు. పథకాల అమలులో వేగం పెంచడం, మంత్రిత్వ శాఖల మధ్య అంతర్గత సమన్వయం , శాఖాపరమైన అవరోధాలు తొలగించడం , సాధారణ ప్రజలకు జీవన సౌలభ్యాన్ని మరింత మెరుగుపరచడం. అంతేకాకుండా, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి ఎలా తీసుకెళ్తున్నారనే అంశంపై మంత్రుల కమ్యూనికేషన్ వ్యూహాలు, డిజిటల్, సోషల్ మీడియా, ప్రజా సమస్యల పరిష్కార నివేదికలపై మంత్రుల పనితీరును ప్రధాని సమీక్షించనున్నారు.ఈ చింతన్ శిబిరం కోసం కేంద్ర మంత్రులను నాలుగు ప్రధాన గ్రూపులుగా విభజించారు. హర్‌దీప్ సింగ్ పూరి, పీయూష్ గోయల్ వంటి సీనియర్ మంత్రుల నేతృత్వంలోని ఈ బృందాలు.. ప్రభుత్వ సంస్కరణలు, టెక్నాలజీ ఆధారిత పాలన, యువత భాగస్వామ్యంపై ప్రత్యేక ప్రజెంటేషన్లు ఇస్తున్నాయి. స్వాతంత్ర్య ఉద్యమం తరహాలోనే వికసిత్ భారత్ ను ఒక ప్రభుత్వ కార్యక్రమంలా కాకుండా ప్రజా ఉద్యమంగా ఎలా మార్చాలనే దానిపై మోదీ ప్రత్యేక దృష్టి సారించారు. దేశంలో మారుతున్న జనాభా తీరుకు అనుగుణంగా సీనియర్ సిటిజన్లను మెంటార్‌షిప్ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడం, విశ్వవిద్యాలయాల్లోని యువతను దేశాభివృద్ధి లక్ష్యాలతో అనుసంధానించడంపై చర్చలు సాగుతున్నాయి.ప్రస్తుత ప్రభుత్వ పదవీకాలం సగానికి సమీపిస్తున్న తరుణంలో ఈ భేటీ జరగడం రాజకీయంగా, పరిపాలనాపరంగా ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. గత ఆగస్టు 15 ఎర్రకోట ప్రసంగంలో ప్రధాని మోదీ ప్రస్తావించిన నెక్ట్ లెవల్ రీఫార్మ్స్‌ను కార్యరూపంలోకి తెచ్చేందుకు ఈ వేదిక ఉపయోగపడుతుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. అదే సమయంలో, మంత్రుల పనితీరు, శాఖాపరమైన అవుట్‌పుట్ ఆధారంగా కేంద్ర మంత్రివర్గ విస్తరణ లేదా మార్పుచేర్పులు జరగవచ్చన్న ఊహాగానాలు ఢిల్లీ వర్గాల్లో వినిపిస్తున్న వేళ సదస్సు హాట్ టాపిక్‌గా మారింది

ఫ్యూచర్ సిటీకి సిక్స్ లైన్స్ రోడ్



హైదరాబాద్, :భారత్ ఫ్యూచర్ సిటీకి కీలకమైన రతన్‌టాటా గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఓఆర్ఆర్ రావిర్యాల ఇంటర్‌ఛేంజ్ నుంచి ఆమన్‌గల్లు వరకు 41.5 కిలోమీటర్ల మేర ఆరు లైన్ల రహదారిని నిర్మిస్తున్నారు. రెండు విడతల్లో చేపడుతున్న ప్రాజెక్టుకు మొత్తం రూ.4,621 కోట్ల వ్యయం చేస్తున్నారు. భవిష్యత్‌లో మరో నాలుగు లైన్ల విస్తరణకు వీలుగా ప్రణాళిక రూపొందించారు. మెట్రో లేదా రైల్వే కారిడార్ కోసం 20 మీటర్ల స్థలాన్ని రిజర్వు చేశారు. ప్రాజెక్టు పూర్తయితే ఫ్యూచర్ సిటీకి రవాణా, పెట్టుబడులు, ప్రాంతీయ అభివృద్ధికి మరింత ఊతం లభించనుంది.తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న భారత్ ఫ్యూచర్ సిటీకి రాజమార్గం రెడీ అవుతోంది. రతన్‌టాటా గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. రేడియల్ రోడ్డు-1లో భాగంగా చేపడుతున్న ఈ ప్రాజెక్టులో భూసేకరణ పూర్తయిన ప్రాంతాల్లో పనులు వేగంగా కొనసాగుతున్నాయి. మార్గమధ్యంలో ఉన్న చిన్నచిన్న కొండలను తొలగిస్తూ రహదారి నిర్మాణానికి అవసరమైన మట్టిపనులు చేపడుతున్నారు. అవసరమైన చోట్ల వంతెనల నిర్మాణ పనులు కూడా ప్రారంభమయ్యాయి. ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) రావిర్యాల ఇంటర్‌ఛేంజ్ నుంచి ప్రతిపాదిత రీజినల్ రింగ్ రోడ్డు ఆమన్‌గల్లు వరకు 41.5 కిలోమీటర్ల పొడవున ఈ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మిస్తున్నారు. ఆరు లైన్ల యాక్సెస్ కంట్రోల్ విధానంలో అంతర్జాతీయ ప్రమాణాలతో రహదారిని అభివృద్ధి చేస్తున్నారు. మొత్తం 100 మీటర్ల వెడల్పుతో నిర్మించే ఈ మార్గం భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని రూపొందుతోంది.ప్రస్తుతం ఆరు లైన్ల రహదారిని నిర్మించనుండగా.. భవిష్యత్తులో మరో నాలుగు లైన్లను విస్తరించేందుకు వీలుగా ప్రణాళిక రూపొందించారు. ఇందుకు అనుగుణంగా అవసరమైన భూసేకరణ చేపడుతున్నారు. ఈ రహదారి పూర్తయితే ఓఆర్ఆర్, రీజినల్ రింగ్ రోడ్డు మధ్య అనుసంధానం బలోపేతం కావడంతో పాటు ఫ్యూచర్ సిటీకి వేగవంతమైన రాకపోకలు సాధ్యమవుతాయి.ప్రాజెక్టును రెండు విడతల్లో చేపడుతున్నారు. తొలివిడతలో రావిర్యాల నుంచి మీర్‌ఖాన్‌పేట్ వరకు 19.2 కిలోమీటర్ల మేర రహదారిని నిర్మిస్తున్నారు. కొంగర్‌ఖుర్ద్, ఫెరోజ్‌గూడ, కొంగరకలాన్, లేమూర్, తిమ్మాపూర్, రాచలూరు, గుమ్మడవెల్లి, పంజాగూడ, మీర్‌ఖాన్‌పేట్ ప్రాంతాల మీదుగా ఈ మార్గం సాగుతుంది. తొలి విడత నిర్మాణానికి రూ.1,911 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. రెండో విడతలో మీర్‌ఖాన్‌పేట్ నుంచి ఆమన్‌గల్లు వరకు 22.3 కిలోమీటర్ల మేర రహదారి నిర్మించనున్నారు. కుర్మిద్ద, కడ్తాల్, ఆకుతోటపల్లి, ఆమన్‌గల్లు ప్రాంతాల మీదుగా ఈ మార్గం సాగుతుంది. రెండో విడత కోసం రూ.2,710 కోట్ల వ్యయం చేయనున్నారు. రెండు విడతల పనులను రిత్విక్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఎల్‌అండ్‌టీ సంస్థలు చేపడుతున్నాయి.రహదారి మధ్యలో భవిష్యత్తులో మెట్రో లేదా రైల్వే కారిడార్ ఏర్పాటు చేసేందుకు 20 మీటర్ల స్థలాన్ని ప్రత్యేకంగా రిజర్వు చేయడం ప్రాజెక్టులో మరో కీలక అంశం. దీంతో భవిష్యత్‌లో ప్రజా రవాణా వ్యవస్థను ఈ కారిడార్‌తో అనుసంధానించేందుకు అవకాశం ఉంటుంది.

సోషల్ మీడియాలో ప్రక్షాళన షురూ



వరంగల్, : తెలంగాణ కాంగ్రెస్ పార్టీ తన సోషల్ మీడియా యంత్రాంగాన్ని పూర్తిగా ప్రక్షాళన చేస్తోంది. ప్రతిపక్షాల నుంచి వ్యక్తమవుతున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టడంతో పాటు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తోంది. డిజిటల్ యుగంలో సోషల్ మీడియాను ప్రధాన ప్రచార అస్త్రంగా మార్చుకునేందుకు రంగం సిద్ధం చేసిందిసోషల్ మీడియా కార్యకలాపాలను మరింత వేగవంతం చేయడానికి టీపీసీసీ సోషల్ మీడియా కొత్త చైర్మన్ నవీన్ పెట్టెం నేతృత్వంలో ప్రత్యేక కసరత్తు జరుగుతోంది. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 670 మండలాలకు నూతన సోషల్ మీడియా కోఆర్డినేటర్లను నియమిస్తున్నారు. ఈ నెలాఖరు నాటికి పూర్తికానున్న ఈ ప్రక్రియ ద్వారా క్షేత్రస్థాయిలో పార్టీ వాణి గట్టిగా వినిపించనుంది. ప్రారంభ దశలో వీరందరికీ ఎక్స్ వేదికగా, ఆ తర్వాత అసెంబ్లీ, జిల్లా స్థాయిలలో ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. జూమ్ యాప్ ద్వారా వర్చువల్ విధానంలో నిరంతరం శిక్షణ, సమీక్షలు చేపట్టనున్నారు.కేవలం కార్యకర్తలకే పరిమితం కాకుండా డీసీసీ అధ్యక్షులు, పీసీసీ కార్యవర్గ సభ్యులు, మండల అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, అబ్జర్వర్లు సహా సుమారు 2వేల మంది ముఖ్య నాయకుల సోషల్ మీడియా యాక్టివిటీని పార్టీ అధిష్టానం నిశితంగా పరిశీలిస్తోంది. వీరందరి ఆన్‌లైన్ ప్రవర్తనపై పార్టీ సోషల్ మీడియా హ్యాండ్లర్స్ ద్వారా ప్రతి వారం ప్రత్యేక నివేదికలు సిద్ధం చేస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సంబంధించిన చిన్న వీడియోలను లేదా అధికారిక పోస్టులను ఈ 2వేల మంది నాయకులు రీపోస్ట్ లేదా రీషేర్ చేసినా, అది బూత్ స్థాయి వరకు సులువుగా చేరుకుంటుందని పార్టీ అంచనా వేస్తోంది. ‘సంగటన్ సృజన్ అభియాన్’ ద్వారా సేకరించిన డేటాతో ఈ లీడర్లందరినీ ఒకే వేదికపైకి తెచ్చారు.రాష్ట్రంలో జరుగుతున్న సాఎఫీ ప్రక్రియ నేపథ్యంలో, పార్టీ రక్షణ కోసం బూత్ లెవెల్ ఏజెంట్లను సోషల్ మీడియా వారసులుగా మారుస్తున్నారు. ఇప్పటికే సుమారు 35వేల మంది బీఎల్ఏలకు స్మార్ట్‌ఫోన్‌లు, ఇతర సాంకేతిక పరికరాలు అందుబాటులో ఉన్నాయి. వీరంతా టెక్-సావీగా ఉండటంతో పాటు, రాబోయే అసెంబ్లీ ఎన్నికల నాటికి క్రియాశీలకంగా వ్యవహరిస్తే సిట్టింగ్ ఎమ్మెల్యేలకు తిరుగుండదని పార్టీ భావిస్తోంది. ప్రతి నియోజకవర్గ ఇన్‌చార్జ్ లేదా ఎమ్మెల్యే తమ పరిధిలోని కనీసం 250 మంది బీఎల్ఏలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని లక్ష్యంగా పెట్టుకున్నారుప్రతిపక్షాల నుంచి ఎదురవుతున్న మైండ్ గేమ్‌ను తిప్పికొట్టడంలో, ప్రభుత్వ విజయాలను డిజిటల్ మాధ్యమాల ద్వారా ప్రజలకు చేరవేయడంలో ఈ నూతన వ్యూహం ఎంతవరకు విజయవంతమవుతుందో వేచి చూడాలి.

రేషన్ కార్డులు... తర్వాత ఫించన్లు



హైదరాబాద్, సెప్టెంబర్ : తెలంగాణ రాజకీయాల్లో కేవలం రాజకీయంగా విపక్షాలకు ముచ్చెమటలు పట్టించడమే కాకుండా సామాన్య ప్రజలకు పథకాలు విస్తృతంగా అందించి క్షేత్రస్థాయిలో పట్టు పెంచుకునేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. ఇప్పటికే దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న లక్షలాది కొత్త రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియను విజయవంతంగా పట్టాలెక్కించిన కాంగ్రెస్ సర్కార్.. ఇప్పుడు మరో సంచలన నిర్ణయం దిశగా అడుగులేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఎదురుచూస్తున్న అర్హులందరికీ అక్టోబర్ నుంచే కొత్త సామాజిక పింఛన్లు మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాబోయే పండుగకు ముందే లబ్ధిదారుల చేతుల్లో ఈ పింఛన్ నగదు ఉండేలా చూడాలని అధికారులకు అత్యున్నత స్థాయి నుంచి స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి.ఈ మేరకు క్షేత్రస్థాయిలో దరఖాస్తుల పరిశీలన, వెరిఫికేషన్ ప్రక్రియను శరవేగంగా పూర్తి చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు ఆదేశాలు అందాయి. ఎక్కడా చిన్నపాటి జాప్యానికి కూడా తావులేకుండా, అవసరమైతే మండల, గ్రామ స్థాయిల్లో అదనపు సిబ్బందిని యుద్ధప్రాతిపదికన నియమించుకోవాలని ప్రభుత్వం అధికార యంత్రాంగానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్క అర్హుడికి పెన్షన్ అందేలా పూర్తి పారదర్శకతతో రికార్డులను సిద్ధం చేయాలని, ఎవరి వద్ద నుంచి ఎలాంటి సిఫార్సులు ఆశించకుండా అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారుల తుది జాబితాను ఖరారు చేయాలని అధికార వర్గాలు ఆదేశించాయి.సమాజంలో అత్యంత నిస్సహాయ స్థితిలో ఉన్న ఒంటరి మహిళలు, వితంతువుల పింఛన్ దరఖాస్తులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏళ్ల తరబడి కొత్త పింఛన్లు మంజూరు కాక, వృద్ధులు, వితంతువులు కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగిన దుస్థితిని కాంగ్రెస్ నాయకత్వం గుర్తు చేస్తోంది. ఇప్పుడు అర్హత ఉన్న ఏ ఒక్క ఒంటరి మహిళ లేదా వితంతువు మిగిలిపోకుండా వంద శాతం కవరేజ్ సాధించాలని నిర్ణయించడం ద్వారా.. మహిళా ఓటు బ్యాంకులో కాంగ్రెస్ గ్రాఫ్‌ను అమాంతం పెంచేలా పక్కా గ్రౌండ్ లెవల్ ప్లాన్ సిద్ధమైంది. ఇది గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని అట్టడుగు వర్గాల్లో ప్రభుత్వానికి తిరుగులేని సానుకూలతను తీసుకువస్తుందని పార్టీ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.గత కొద్ది రోజులుగా అసెంబ్లీ వేదికగా కేసీఆర్, కేటీఆర్ లక్ష్యంగా భూ వివాదాలు, ఫామ్‌హౌస్ లీజులు, దానం అనర్హత అంశాలతో విరుచుకుపడుతున్న రేవంత్ రెడ్డి.. సమాంతరంగా సంక్షేమ కార్డును ప్రయోగించడం రాజకీయంగా బీఆర్ఎస్‌కు కోలుకోలేని దెబ్బేనని భావిస్తున్నారు. కాంగ్రెస్ వస్తే పథకాలు ఆగిపోతాయి అంటూ బీఆర్ఎస్ చేసిన ప్రచారాన్ని తొలుత రేషన్ కార్డుల మంజూరుతో, ఇప్పుడు కానుకగా కొత్త పెన్షన్ల ప్రకటనతో ప్రభుత్వం పటాపంచలు చేసింది. సంక్షేమ లబ్ధిదారులను నేరుగా తమ వైపు తిప్పుకోవడం ద్వారా. ట బీఆర్ఎస్ సంప్రదాయ ఓటు బ్యాంకును గండికొట్టేలా రేవంత్ ప్రభుత్వం వేసిన ఈ డబుల్-స్ట్రోక్ రాజకీయ సమీకరణాలను సమూలంగా మార్చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

కాచిగూడ రైల్వేస్టేషన్ కొత్త సొబగులు



హైదరాబాద్, : భాగ్యనగర చారిత్రక శోభకు, నిజాం కాలం నాటి నిర్మాణ వైభవానికి ప్రతీకగా నిలిచే కాచిగూడ రైల్వే స్టేషన్ రూపురేఖలు మారనున్నాయి. చారిత్రక వారసత్వాన్ని కాపాడుతూనే ప్రయాణికులకు ఆధునిక సదుపాయాలు అందించేలా స్టేషన్ పునరాభివృద్ధికి దక్షిణ మధ్య రైల్వే ప్రాథమిక ప్రణాళిక సిద్ధం చేసింది. డ్రాఫ్ట్ కాన్సెప్ట్ ప్లాన్ ప్రకారం సుమారు రూ.474.29 కోట్ల అంచనా వ్యయంతో స్టేషన్‌ను ఆధునికీకరించేందుకు ప్రతిపాదనలు రూపొందించారు. ప్రస్తుతం ఇది కేవలం డ్రాఫ్ట్ ప్లాన్ మాత్రమేనని, తుది ప్రణాళికలో కొన్ని మార్పులు, చేర్పులు ఉండే అవకాశం ఉందని రైల్వే అధికారులు తెలిపారు. స్టేషన్ పశ్చిమ వైపున ఉన్న పురాతన హెరిటేజ్ భవనాన్ని యథాతథంగా పరిరక్షించాలని ప్రతిపాదించారు. అదే సమయంలో తూర్పు వైపు, అంబర్‌పేట వైపున ఆధునిక టెర్మినల్ భవనాన్ని నిర్మించేలా డ్రాఫ్ట్ ప్లాన్‌ను రూపొందించారు. దీంతో పాత నిర్మాణానికి ఉన్న చారిత్రక ప్రాధాన్యాన్ని కాపాడుతూనే కొత్త అవసరాలకు అనుగుణంగా స్టేషన్‌ను విస్తరించే అవకాశం ఏర్పడుతుంది. ప్లాట్‌ఫాంల పైన 72 మీటర్ల వెడల్పు, 115 మీటర్ల పొడవుతో విశాలమైన ఎయిర్ కాన్‌కోర్స్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఇందులో ఫుడ్ కోర్టులు, ఎగ్జిక్యూటివ్ లాంజ్‌లు, రిటైల్ అవుట్‌లెట్లు, ప్రదర్శన హాళ్లు, పిల్లల ఆట స్థలాలు వంటి నదుపాయాలు కల్పించేలా ప్రణాళిక రూపొందించారు. ప్రయాణికులు రైలు కోసం వేచి ఉండే సమయంలో మెరుగైన సౌకర్యాలు పొందేలా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయనున్నారు.స్టేషన్‌లో రద్దీని తగ్గించి ప్రయాణికుల రాకపోకలను సులభతరం చేయడంపై కూడా ప్రణాళికలో దృష్టి పెట్టారు. రైలు ఎక్కే ప్రయాణికులు, రైలు దిగే ప్రయాణికులు ఒకరికి ఒకరు అడ్డంకిగా మారకుండా విడివిడిగా మార్గాలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. అవసరమైన చోట్ల ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను నిర్మించనున్నారు. కాచిగూడ రైల్వే స్టేషన్‌కు పక్కనే ఉన్న ఆర్టీసీ బస్ స్టేషన్‌తో మెరుగైన కనెక్టివిటీ కల్పించేందుకు స్కైవాక్ నిర్మాణాన్ని కూడా ప్రతిపాదించారు. పశ్చిమ, తూర్పు వైపుల వాహనాల పార్కింగ్ కోసం మల్టీ లెవల్ కార్ పార్కింగ్ సదుపాయాలు ఏర్పాటు చేయాలని ప్రణాళికలో పొందుపరిచారు. రైలు, బస్సు, వ్యక్తిగత వాహనాల రాకపోకలను సమన్వయం చేసేలా మల్టీమోడల్ కనెక్టివిటీని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కనిపిస్తోంది.కాచిగూడ రైల్వే స్టేషన్ హైదరాబాద్ రైల్వే చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉంది. 1916లో నిజాం కాలంలో నిర్మించిన ఈ స్టేషన్ భవనం ఇండో-ఇస్లామిక్ వాస్తుశిల్ప శైలికి, ఆ కాలం నాటి నిర్మాణ నైపుణ్యానికి ప్రతీకగా నిలుస్తోంది. నిజాం స్టేట్ రైల్వేస్ అభివృద్ధిలో భాగంగా ఏర్పాటైన ఈ స్టేషన్ అప్పట్లో హైదరాబాద్ నగరానికి కీలక రైల్వే కేంద్రంగా మారింది. కాలక్రమంలో నగరం విస్తరించడంతో కాచిగూడ స్టేషన్ ప్రాధాన్యం కూడా పెరిగింది. దశాబ్దాలుగా లక్షలాది మంది ప్రయాణికులకు సేవలందిస్తున్న ఈ చారిత్రక భవనం నేటికీ తన ప్రత్యేక రూపాన్ని నిలుపుకుంది. అందుకే పునరాభివృద్ధిలో పాత హెరిటేజ్ భవనాన్ని పరిరక్షిస్తూ.. దాని చుట్టూ ఆధునిక మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం ప్రాధాన్యంగా మారింది.

ఫాం హౌస్ లో10 ఎకరాల అసైన్డ్ భూమి



మెదక్ : మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎర్రవల్లి ఫాంహౌస్ అంశం మరోసారి కేంద్ర బిందువుగా మారింది. ఈ భూములపై ప్రభుత్వం శరవేగంగా విచారణ చేపడుతోంది. సిద్ధిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లిలోని సర్వే నంబర్ 325లో ఉన్న ప్రభుత్వ గైరాన్ భూములు, అసైన్డ్ భూముల అన్యాక్రాంతంపై రెవెన్యూ యంత్రాంగం ఉక్కుపాదం మోపుతోంది.ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు ఎర్రవల్లి, సమీప శివారు వెంకాపురం గ్రామాల్లో గత మూడు రోజులుగా భూ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. డిఫరెన్షియల్ గ్లోబల్ పొజిషనింగ్ సర్వే ద్వారా ప్రభుత్వ భూముల హద్దులను స్పష్టంగా గుర్తించారు. ప్రాథమిక విచారణలో కేసీఆర్ ఫాంహౌస్ పరిధిలో సుమారు 10 ఎకరాల అసైన్డ్ భూమి ఉన్నట్లు వెల్లడైంది. అంతేకాకుండా, దళితులకు కేటాయించాల్సిన ఈ భూములను కొందరు అన్యాక్రాంతం చేసుకుని, ఫాంహౌస్ అవసరాల కోసం నీటి వనరుల నిర్మాణానికి ఉపయోగించినట్లు తేలింది.భూ ఆక్రమణలపై సిద్ధిపేట జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆదేశాల మేరకు అధికారులు చర్యలు వేగవంతం చేశారు. సర్వే నంబర్ 325 పరిధిలోని సుమారు 388.05 ఎకరాల గైరాన్ భూమి ఆక్రమణలను గుర్తించి, సంబంధిత భూయజమానులకు గత వారంలోనే 180 నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులపై స్పందించాల్సిన భూయజమానులు ఇవాల్టి నుంచి తమ పత్రాలతో అధికారుల ముందు హాజరవుతున్నారు. పట్టాదారు పాస్‌పుస్తకాలు, ఇతర చట్టబద్ధమైన పత్రాలను సమర్పిస్తే పరిశీలిస్తామని అధికారులు స్పష్టం చేశారు.గత ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్ రాకతో రికార్డులు తారుమారయ్యాయని స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు. ఎర్రవల్లి, శివారు వెంకాపురం గ్రామాల మధ్య సర్వే నంబర్లు, భూ రికార్డుల్లో తీవ్రమైన లొసుగులు, ఓవర్‌లాపింగ్ ఉన్నాయని మర్కుక్ తహశీల్దార్ సరితకు స్థానికులు ఫిర్యాదు చేశారు. పాండురంగ రిజర్వాయర్ కోసం భూములు కోల్పోయిన రైతన్నలకు ప్రత్యామ్నాయ భూములు ఇస్తామని గతంలో ఇచ్చిన హామీలు నెరవేరలేదని వాపోతున్నారు.ఈ వివాదంపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం అత్యంత వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. వివాదాస్పద సర్వే నంబర్ 325లో నిబంధనలకు విరుద్ధంగా అసైన్డ్ భూములను అనుభవిస్తున్న అనర్హులను తొలగించడమే లక్ష్యంగా ప్రణాళిక రూపొందించారు. నిజమైన దళిత రైతులకు దక్కాల్సిన భూములను వెనక్కి తీసుకుని, నిరుపేద దళిత కుటుంబాలకు పంపిణీ చేయాలని సర్కార్ భావిస్తోంది. మరోవైపు ఏ ఒక్క దళితుడి లేదా గిరిజనుడి భూమిని ప్రభుత్వం తీసుకోదని, సెక్షన్ 22ఏ పై మళ్లీ సర్వే నిర్వహించి బాధితులకు న్యాయం చేస్తామని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.

ఆయుర్వేదానికి పూర్వ వైభవం

హైదరాబాద్ : ప్రాచీన భారతీయ వైద్య విధానమైన ఆయుర్వేదానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం పూర్వ వైభవం తీసుకొస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. నాంపల్లిలోని ఫ్యాబ్సీ భవన్‌లో బీజేపీ మెడికల్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన 11వ ఆయుర్వేద డే వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా రామచందర్‌రావు మాట్లాడుతూ.. ఆయుర్వేదం భారతదేశ ప్రాచీన వైద్య సంప్రదాయమని పేర్కొన్నారు. గతంలో దేశాన్ని పాలించిన మొఘలులు, బ్రిటిష్ పాలకులు ఆయుర్వేద వైద్య విధానాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. అయితే ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో ఆయుర్వేదానికి దేశవ్యాప్తంగా గుర్తింపు పెరుగుతోందని తెలిపారు.ఆయుర్వేద వైద్యం ద్వారా అనేక దీర్ఘకాలిక వ్యాధులకు ఉపశమనం లభిస్తోందని రామచందర్‌రావు పేర్కొన్నారు. ప్రజలకు ఆయుర్వేదంపై మరింత అవగాహన కల్పించడంతోపాటు, సంప్రదాయ వైద్య విధానాలను ఆధునిక పరిశోధనలతో అనుసంధానం చేయాల్సిన అవసరం ఉందన్నారు. భారతదేశం నుంచి ఆయుర్వేద ఉత్పత్తుల ఎగుమతులు 20 శాతం పెరిగినట్లు ఆయన గుర్తుచేశారు. ఆయుర్వేద వైద్య విధానం, ఔషధ ఉత్పత్తుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో ఈ రంగానికి మరింత ప్రోత్సాహం లభిస్తోందన్నారు.అనంతరం ఆయుర్వేద రంగంలో విశేష సేవలందిస్తున్న పలువురు వైద్యులను రామచందర్‌రావు ఘనంగా సన్మానించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగ, కార్మిక పక్షపాతి ప్రభుత్వం

హైదరాబాద్ : కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగ, కార్మిక పక్షపాతి ప్రభుత్వం అని, వారి సమస్యలను ఒకొక్కటిగా పరిష్కరించుకుంటూ వస్తుందని అల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్మన్ మధు యాష్కీ గౌడ్ తెలిపారు. హైదరాబాద్ గోషామహల్ లో జలమండలి గుర్తింపు కార్మిక సంఘం తెలంగాణ జలమండలి ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయాన్ని తెలంగాణ జలమండలి ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు మొగుళ్ళ రాజిరెడ్డితోకలసి మధు యాష్కీ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మధు యాష్కీ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల ఉద్యోగులు, కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. ఇందులో భాగంగానే కోటి మంది కార్మికులకు కనీన వేతనాలను అమలులోకి తీసుకవచ్చిందని చెప్పారు. ఇప్పటికే జలమండలి కార్మికుల సమస్యలను పరిష్కరించడంతోపాటు అదేవిదంగా ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కరానికి కృషి చేస్తుదని చెప్పారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిస్కారం అధికార కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని, త్వరలో జరగనున్న ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరుస్తున్న తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ గెలిపించాలని మధు యాష్కీ గౌడ్ కోరారు. మొగుళ్ళ రాజిరెడ్డి మాట్లాడుతూ జలమండలి కార్మికులకు అండగా ఉన్నట్లే ఇతర కార్మికుల సమస్యలను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరిస్తుందని తెలిపారు.

హైదరాబాద్‌లో మరో 50-70 జీసీసీలు...



హైదరాబాద్ కేంద్రంగా ప్రస్తుతం 515 గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జీసీసీలు) కార్యకలాపాలు సాగిస్తున్నాయి. జీసీసీ సెంటర్లకు అవసరమైన ప్రతిభావంతుల లభ్యత అపారంగా ఉండటం, తక్కువ వ్యయాలు అవుతున్నందున, ఏడాదిలోగా మరో 50-70 జీసీసీలు హైదరాబాద్‌లో ఏర్పాటు కానున్నాయని పరిశ్రమల సమాఖ్య ఫిక్కీ, ప్రోపర్టీ కన్సల్టెంట్ అనరాక్ సంయుక్త నివేదిక వెల్లడించింది.

'హైదరాబాద్: ది రైజ్ ఆఫ్ ఏ గ్లోబల్ కేపబిలిటీ పవర్‌హౌస్' పేరుతో ఈ నివేదికను రూపొందించాయి. దీని ప్రకారం.. 2026 మార్చి చివరికి హైదరాబాద్‌లో 515 జీసీసీలు ఉండగా, వీటిలో 3 లక్షల మందికి పైగా ఉద్యోగులు పని చేస్తున్నారు. మన దేశంలోని మొత్తం జీసీసీల్లో సుమారు 20% హైదరాబాద్‌లోనే ఉన్నాయి.

దీంతో ఈ నగరం 'సైబర్ సిటీ' స్థాయి నుంచి 'జీసీసీ హబ్'గా రూపాంతరం చెందుతోంది. హైదరాబాద్ కార్యాలయ స్థలాల మార్కెట్‌లో గిరాకీకి జీసీసీలు కీలకంగా మారాయి. జీసీసీల ఏర్పాటు కోసం విదేశీ సంస్థలు అద్దెకు తీసుకున్న కార్యాలయ స్థలం 2021లో 19 లక్షల చదరపు అడుగులు కాగా, 2025 నాటికి 45 లక్షల చదరపు అడుగులకు పెరిగింది. ఈ ఏడాది తొలి 6 నెలల్లోనే మరో 30 లక్షల చదరపు అడుగుల స్థలాన్ని ఆయా సంస్థలు తీసుకున్నాయి.

సంప్రదాయ సేవలకు మించి: లీజింగ్‌లో వృద్ధి కొనసాగడాన్ని గమనిస్తే, ప్రపంచవ్యాప్త కంపెనీలు హైదరాబాద్‌లో తమ పెద్ద కార్యాలయాలు నెలకొల్పడానికి ప్రాధాన్యమిస్తున్నాయని తేలుతోందని అనరాక్ ఛైర్మన్ అనూజ్ పురి వెల్లడించారు. హైదరాబాద్ జీసీసీలు సంప్రదాయ ఐటీ-ఐటీఈఎస్ కార్యకలాపాల పరిధిని మించి.. బీఎఫ్ఎస్ఐ, లైఫ్‌సైన్సెస్, సెమికండక్టర్లు, ఇంజినీరింగ్, ఆరోగ్య సంరక్షణతో పాటు బహుళ రంగాల పర్యావరణ వ్యవస్థగా విస్తరిస్తున్నట్లు ఫిక్కీ తెలంగాణ రాష్ట్ర మండలి ఛైర్మన్ వి.వి.రామరాజు పేర్కొన్నారు. ప్రతిభావంతుల లభ్యత అధికంగా ఉండటంతో పాటు హైదరాబాద్‌లోని ఏ గ్రేడ్ కార్యాలయ స్థలాల అద్దె చదరపు అడుగుకు రూ.95-115గా ఉంది. ఇది బెంగళూరు కంటే తక్కువగానూ, పుణెతో పోటీపడే స్థాయిలోనూ ఉంది.

చిన్నారుల భద్రతపై మెటా కీలక నిర్ణయం.. కంటెంట్ ఇస్తామని హామీ!

సోషల్ మీడియా ప్లాట్ ఫామ్స్ పై పిల్లల భద్రతను పటిష్టం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో భాగంగా ప్రముఖ ఐటీ సంస్థ మెటా కీలక నిర్ణయం తీసుకుంది.

భారతీయ చట్టాలకు లోబడి, పిల్లలపై లైంగిక వేధింపులు, ఇతర వేధింపులకు సంబంధించిన కేసులను నేరుగా సంబంధిత భారతీయ పోలీసు, దర్యాప్తు సంస్థలకు నివేదించడానికి మెటా అంగీకరించినట్లు ప్రభుత్వ వర్గాలు మంగళవారం వెల్లడించాయి. దేశంలో ఏ సోషల్ మీడియా వేదిక అయినా కార్యకలాపాలు నిర్వహించాలంటే చిన్నారుల డిజిటల్ భద్రతే ప్రాథమిక సూత్రమని, ఈ విషయంలో ఎలాంటి రాజీ లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇటీవల మెటా యాజమాన్యంలోని ఇన్‌స్టాగ్రామ్‌లో చిన్నారులపై లైంగిక వేధింపుల ప్రచార ప్రకటనలు కనిపిస్తున్నాయంటూ బీబీసీ ఐ నిర్వహించిన పరిశోధనలో వెల్లడైంది. దీని ఆధారంగా జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ విచారణ చేపట్టగా, సెప్టెంబర్ 9న మెటా ఇండియా ప్రతినిధులు హాజరయ్యారు. దీనికి ముందే జూలై నెలలోనూ కేంద్ర ప్రభుత్వం మెటాకు నోటీసులు జారీ చేస్తూ, అభ్యంతరకర కంటెంట్‌ను వెంటనే తొలగించాలని ఆదేశించింది. ఈ ఒత్తిడి నేపథ్యంలోనే మెటా భారతదేశంలో తన విధానాలను మరింత కఠినతరం చేయడానికి అంగీకరించింది. గతంలో అమెరికాకు చెందిన ఔఅఓఇఅ ద్వారా సమాచారాన్ని పంపేవారని, ఇకపై నేరుగా భారత చట్టాల ప్రకారం (ఖూఅూా చట్టం పరిధిలో) చర్యలు తీసుకునేందుకు సహకరిస్తామని తెలిపింది. అలాగే గడిచిన ఆరు నెలల కాలంలోనే భారత్‌లో ఇటువంటి నిబంధనలు ఉల్లంఘించిన దాదాపు 1,60,000 అకౌంట్లను తొలగించినట్లు సంస్థ పేర్కొంది. చిన్నారుల భద్రతపై కేవలం ఫిర్యాదులు వచ్చినప్పుడు స్పందించడమే



కాకుండా, ముందస్తుగానే అభ్యంతరకర కంటెంట్‌ను గుర్తించి తొలగించేలా చర్యలు తీసుకోవాలని మెటాతో పాటు ఇతర సోషల్ మీడియా సంస్థలకు ప్రభుత్వం గట్టి హెచ్చరికలు జారీ చేసింది.

ఆగస్టులో 9.92శాతానికి పెరిగిన టోకు ద్రవ్యోల్బణం



దేశంలో టోకు ద్రవ్యోల్బణం ఆగస్టులో మరింత పెరిగింది. జూలైలో 9.78శాతంగా ఉన్న టోకు ధరల సూచీ(డబ్ల్యూపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం ఆగస్టులో 9.92శాతానికి చేరింది. వరుసగా నాలుగో నెలలోనూ టోకు ద్రవ్యోల్బణం దాదాపు 10శాతం స్థాయిలో కొనసాగింది. ఆహార పదార్థాల ధరల పెరుగుదలతో పాటు ఇంధనం, విద్యుత్, తయారీ రంగ ఉత్పత్తుల ధరలు పెరగడం ద్రవ్యోల్బణం పెరుగుదలకు ప్రధాన కారణాలుగా నిలిచాయి. ఆహార పదార్థాల ద్రవ్యోల్బణం జూలైలో 6.65శాతం ఉండగా ఆగస్టులో 7.05 శాతానికి పెరిగింది. తయారీ ఉత్పత్తుల ద్రవ్యోల్బణం 8.29శాతం నుంచి 8.37శాతానికి చేరింది. ఇంధనం, విద్యుత్ విభాగంలో ధరల పెరుగుదల మరింత తీవ్రంగా ఉంది. ఈ విభాగంలో ద్రవ్యోల్బణం జూలైలో 20.05శాతం ఉండగా ఆగస్టులో 22.93శాతానికి పెరిగింది. ముఖ్యంగా పెట్రోలియం, సహజవాయువు ధరలు 34.41శాతం పెరిగాయి.

ఆహార పదార్థాల ధరల పెరుగుదలతో పాటు ఇంధనం, విద్యుత్, తయారీ రంగ ఉత్పత్తుల ధరలు పెరగడం ద్రవ్యోల్బణం పెరుగుదలకు ప్రధాన కారణాలుగా నిలిచాయి. ఆహార పదార్థాల ద్రవ్యోల్బణం జూలైలో 6.65శాతం ఉండగా ఆగస్టులో 7.05 శాతానికి పెరిగింది.

తయారీ ఉత్పత్తుల ద్రవ్యోల్బణం 8.29శాతం నుంచి 8.37శాతానికి చేరింది. ఇంధనం, విద్యుత్ విభాగంలో ధరల పెరుగుదల మరింత తీవ్రంగా ఉంది. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు, అంతర్జాతీయ చమురు ధరల పెరుగుదల దేశీయ ధరలపై ప్రభావం చూపినట్లు నిపుణులు పేర్కొన్నారు.

ఎఫ్‌టీఏ కింద 2.5 లక్షల కార్లకు ఈయూ అనుమతి...



ద్వైపాక్షిక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కింద, ఒక ఏడాదిలో భారత్‌లో తయారైన 2.5 లక్షల కార్లను 8% సుంకంపైనే తమ మార్కెట్లోకి అనుమతించాలని ఐరోపా సమాఖ్య (ఈయూ) నిర్ణయించింది. ఈ కోటాను క్రమంగా 4 లక్షల కార్లకు పెంచనున్నట్లు ఈయూ విడుదల చేసిన ఒప్పంద ముసాయిదా వెల్లడించింది. మన దేశంలో తయారయ్యే సంప్రదాయ పెట్రోల్ కార్లు, హైబ్రిడ్ విద్యుత్తు వాహనాలకు ఈ సుంకం రాయితీలు వర్తిస్తాయి. వాహనం ధర, బీమా, రవాణా ఖర్చులు కలిపి 50,000 యూరోల (సుమారు రూ.55.48 లక్షల) వరకు ధర ఉన్న కార్లకే ఈ రాయితీలు వర్తిస్తాయి. కోటా ఆధారిత రాయితీ సుంకాన్ని ఎఫ్‌టీఏ అమల్లోకి వచ్చిన రెండో ఏడాదిలో 6 శాతానికి తగ్గిస్తారు. మూడో ఏడాదిలో సుంకం 4 శాతానికి, నాలుగో ఏడాదిలో 2 శాతానికి తగ్గుతుంది. అయిదో ఏడాది నుంచి సుంకం పూర్తిగా సున్నాకు చేరుతుంది. మొదటి ఏడాదిలో 2.5 లక్షలుగా ఉన్న వార్షిక వాహనాల కోటా క్రమంగా పెరిగి, 10వ ఏడాదిలో 4 లక్షలకు చేరుతుంది. ఈ ఒప్పందంపై ఈ ఏడాది చివర్లో సంతకం చేసే అవకాశం ఉంది. వచ్చే ఏడాది నుంచి ఇది అమల్లోకి రావచ్చు.బ్యాటరీ విద్యుత్తు వాహనాలు, ప్లగ్-ఇన్ హైబ్రిడ్ విద్యుత్తు వాహనాల్లో 40,000 యూరోల వరకు ధర ఉన్న వాటికి అయిదో ఏడాది నుంచి సుంకం కోటా అమల్లోకి వస్తుంది. మన దేశంలో ఉత్పత్తి చేసిన కొన్ని వ్యవసాయ - ప్రాసెస్డ్ ఫుడ్ ఉత్పత్తులకు కూడా ఈయూ కోటా ఆధారిత సుంకం రాయితీలు అందించనుంది. ఈ ఉత్పత్తుల్లో టేబుల్ ద్రాక్ష, డ్రైడ్ ఆనియన్స్, దోసకాయలు మరియు గెర్కిన్స్, మొలాసిస్ ఆధారిత రమ్, నెయ్యి ఉన్నాయి. ఐరోపా సమాఖ్యకు నిర్దిష్ట సుంకం- రేటు కోటా (టీఆర్‌క్యూ) కింద ఏడాదిలో మొత్తం 16.4 లక్షల టన్నుల ఉక్కు ఉత్పత్తులను ఎగుమతి చేసే అవకాశం మనదేశానికి లభించనుంది. ఇందులో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) కింద 6,94,853 టన్నుల కోటా కేటాయించినట్లు ఐరోపా సమాఖ్య (ఈయూ) వెల్లడించింది. మొత్తం 16.4 లక్షల టన్నుల్లో మోస్ట్ ఫేవర్డ్ నేషన్ (ఎంఎఫ్ఎన్) కింద 9.46 లక్షల టన్నులు, ఎఫ్‌టీఏ కింద 6.94 లక్షలు కేటాయించారు. నాన్-అలాయ్, అలాయ్ హాట్-రోల్డ్ షీట్లు/ స్ట్రిప్స్, కోల్డ్-రోల్డ్ షీట్లు, మెటాలిక్-కోటెడ్ షీట్లు, ఆర్గానిక్ కోటెడ్ షీట్లు, స్టెయిన్‌లెస్ స్టీల్ ఉత్పత్తులు, టిన్ మిల్ ఉత్పత్తులు, రీబార్లు, వైర్ రాడ్లు, పైపులు, ట్యూబ్‌లకు ఈ కోటాలు వర్తిస్తాయి.

మన దేశంలో ఉత్పత్తి చేసిన కొన్ని వ్యవసాయ - ప్రాసెస్డ్ ఫుడ్ ఉత్పత్తులకు కూడా ఈయూ కోటా ఆధారిత సుంకం రాయితీలు అందించనుంది.

ఈ ఉత్పత్తుల్లో టేబుల్ ద్రాక్ష, డ్రైడ్ ఆనియన్స్, దోసకాయలు మరియు గెర్కిన్స్, మొలాసిస్ ఆధారిత రమ్, నెయ్యి ఉన్నాయి.

భారత్‌కి కలిసొచ్చిన సెలవు.. లేదంటే భారీ నష్టాలే!



అంతర్జాతీయ స్టాక్ మార్కెట్లలో ఒక్కసారిగా ప్రకంపనలు మొదలయ్యాయి. వారం స్టార్ట్ అయిన తొలి రోజే ప్రపంచవ్యాప్తంగా, ముఖ్యంగా ఆసియా దేశాల మార్కెట్లలో ఇన్వెస్టర్లకు భారీ షాక్ తగిలింది. జపాన్ నుంచి దక్షిణ కొరియా, పాకిస్థాన్ వరకు ప్రధాన సూచీలన్నీ నిలువునా కుప్పకూలాయి. అయితే ఈ దారుణ పరిస్థితుల్లో భారతీయ మదుపరులకు మాత్రం అనూహ్య ఊరట లభించింది. సోమవారం గణేష్ చతుర్థి సందర్భంగా భారత స్టాక్ మార్కెట్లు మూతపడటంతో దేశీయ మార్కెట్లను ముంచెత్తాల్సిన పెను నష్టం తాత్కాలికంగా తప్పిపోయింది. వారం మొదటి ట్రేడింగ్ సెషన్‌లో ఆసియా మార్కెట్లు తీవ్ర ఒడిదుడుకులను ఎదుర్కొన్నాయి. జపాన్ బెంచ్‌మార్క్ సూచీ 'నిక్కీ' ఏకంగా 500 పాయింట్లకు పైగా పతనమై 63,492 వద్దకు జారుకుంది. దక్షిణ కొరియాకు చెందిన 'కోస్పి' 250 పాయింట్లు పతనమై 6,684 వద్ద ట్రేడ్ అవుతోంది. మరోవైపు తైవాన్ మార్కెట్ 322 పాయింట్లు నష్టపోగా, పాకిస్థాన్‌కు చెందిన కరాచీ 100 (ఖూఇ) సూచీ సైతం దాదాపు 188 పాయింట్లు పడిపోయింది. మార్కెట్లు తెరిచిన క్షణం నుంచే అమ్మకాల వెల్లువ కొనసాగడంతో ప్రపంచవ్యాప్తంగా ఇన్వెస్టర్ల సంపద భారీగా ఆవిరైంది. బీఎస్ఈ, ఎన్ఎస్ఈ సెలవుల క్యాలెండర్ ప్రకారం సెప్టెంబర్ 14న గణేష్ చతుర్థి పర్వదినాన్ని పురస్కరించుకుని భారత స్టాక్ ఎక్స్ఛేంజీలు క్లోజ్ చేశారు. దీంతో ఈక్విటీ (షేర్లు), ఈక్విటీ డెరివేటివ్స్, కరెన్సీ మార్కెట్లలో ఎలాంటి లావాదేవీలు జరగలేదు. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఓఅచీ) కూడా ఉదయం సెషన్‌లో మూతపడి, సాయంత్రం 5 గంటల నుంచి మాత్రమే కార్యకలాపాలు సాగించనుంది. ఇప్పటికే గత వారం తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్న దలాల్ స్ట్రీట్.. సెన్సెక్స్‌లో 2.27 శాతం, నిఫ్టీలో 2 శాతానికి పైగా క్షీణతను చూసింది. ఒకవేళ సోమవారం మన మార్కెట్లు ఓపెన్‌లో ఉండి ఉంటే, గ్లోబల్ మార్కెట్ల ప్రభావంతో దేశీయ మార్కెట్లలో మరింత కరెన్సీ రక్తపాతం నమోదై ఉండేదనడంలో ఎలాంటి సందేహం లేదు. సెలవు పుణ్యమా అని భారత మార్కెట్లు ఈ గండం నుంచి గట్టెక్కాయి. ఈ వారం భారత్‌లో ట్రేడింగ్ కేవలం నాలుగు రోజులు మాత్రమే జరగనుంది. గ్లోబల్ మార్కెట్లు ఈ స్థాయిలో కుప్పకూలడానికి మధ్యప్రాచ్యంలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతలే ప్రధాన కారణంగా కనిపిస్తున్నాయి.

అగ్రరాజ్యం అమెరికా, ఇరాన్‌ల మధ్య ఘర్షణ వాతావరణం ముదురుతుండటంతో వ్యూహాత్మక వాణిజ్య మార్గమైన హోర్ముజ్ జలసంధి తెరుచుకోవడంపై అనిశ్చితి నెలకొంది. దీనికితోడు బాబ్ అల్-మండేబ్ జలసంధి ప్రాంతాన్ని హౌతీ తిరుగుబాటుదారులు తమ ఆధీనంలోకి తెచ్చుకుంటున్నారన్న వార్తలు, సౌదీ అరేబియా చమురు పైప్‌లైన్ మూసివేత పరిస్థితులను మరింత దిగజార్చాయి. ఈ పరిణామాల దెబ్బకు అంతర్జాతీయంగా ముడి చమురు ధరలకు ఒక్కసారిగా రెక్కలొచ్చాయి.

"ఇదే మీ లాస్ట్ వర్కింగ్ డే' : ఉద్యోగులకు షాకిచ్చిన ఒరాకిల్



ఉద్యోగులకు ఒరాకిల్ భారీ షాక్‌నిచ్చింది. 'మీ ఉద్యోగానికి సంబంధించి ఒక కఠినమైన వార్తను తెలియజేస్తున్నాం. ఇదే మీ చివరి పనిదినం " అంటూ ఉద్యోగులకు సోమవారం ఉదయం 6.00గంటలకు ఈమెయిల్ పంపినట్లు సంబంధిత వర్గాలు పేపర్కొన్నాయి. ఎఐ, క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై ఒరాకిల్ భారీగా ఖర్చు చేస్తున్న నేపథ్యంలో తాజా లేఆఫ్‌లకు సిద్ధమైనట్లు తెలిపాయి.

అయితే ఎంతమంది ఉద్యోగులను తొలగించిందన్న అంశంపై సమాచారం లేదు. విస్తృత సంస్థాగత మార్పుల్లో భాగంగా తొలగిస్తున్నట్లుఈ మెయిల్ పేర్కొంది. అయితే ఉద్యోగిని ఎందుకు తొలగిస్తున్నారు అనే అంశంపై వివరణనివ్వలేదు. ఒరాకిల్ కంప్యూటర్లు, ఈమెయిల్, వాయిస్ మెయిల్, ఫైళ్లకు వారి యాక్సెస్ త్వరలో నిలిపివేయనున్నట్లు ఉద్యోగులకు తెలిపారు. పిఎఫ్, ఇతర వివరాల గురించి సమాచారం కోసం వ్యక్తిగత ఈమెయిల్ చిరునామాను పంపాల్సిందిగా ఒరాకిల్ ఉద్యోగులను కోరింది. ఉద్యోగులకు ఈమెయిల్ వచ్చిన కొద్దిసేపికే వారు కంపెనీ సిస్టమ్‌ల యాక్సెస్‌ను కోల్పోవడం గమనార్హం. ఇప్పటికే ఈ ఏడాది ప్రారంభంలో ఒరాకిల్ సుమారు 21,000మంది ఉద్యోగులను తొలగించిన సంగతి తెలిసిందే. ఇది ఆ సంస్థ మొత్తం ఉద్యోగుల్లో 13శాతానికి సమానం. అంతకు ముందు సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా ఒరాకిల్లో సుమారు 1,62,000గా ఉన్న ఉద్యోగుల సంఖ్య మేనాటికి సుమారు 1,41,000కి చేరింది.

అమెరికాలో సామ్యవాద జ్వాల.....



పెట్టుబడిదారుల కలల సామ్రాజ్యంలో సామ్యవాద జ్వాల ఎగుస్తోంది. తనకు ఇక ఎదురు ఎవ్వరూ లేరంటూ ఇష్టారీతిన నిర్ణయాలు తీసుకుంటూ పెట్టుబడిదారుల సేవల మునిగితేలుతున్న అధ్యక్ష?లు డొనాల్డ్ ట్రంప్ భావజాలాన్ని ఛీకొట్టి ప్రజాతంత్ర, సామ్యవాద భావాలు వికసిస్తున్నాయి. 21న ప్రముఖ వార్తా సంస్థ 'ద హిందూ' ప్రచురించిన సంపాదకీయం సారాంశామిది.. అమెరికాలో ట్రంప్ ప్రభుత్వం తన అస్తవ్యస్థ విధానాలు, నిర్ణయాలతో దేశ విదేశాంగ విధానాన్ని పునర్నిర్మించడానికి ప్రయత్నిస్తూనే వుంది. పశ్చిమాసియాలో యుద్ధాలు, వెనిజులాలో అధికారాన్ని ఒక రకంగా హస్తగతం చేసుకోవడం, క్యూబా ఇంధన వాణిజ్యాన్ని ఉక్కిరిబిక్కిరి చేయడం, బహుళపక్ష సంస్థల నుండి బయటకు రావడం, ఇష్టానుసారం సుంకాలు విధించడం వంటి చర్యల్లో కనిపించే ఏకాంతవాదం వంటి అతి దూకుడుతో కూడిన సామ్రాజ్యవాద చర్యల నేపథ్యంలో ట్రంపిజానికి ఒక రాజకీయ ప్రత్యామ్నాయం కోసం ప్రపంచం ఎదురుచూ స్తోంది.

ఈ వాటర్ ఆరోగ్యానికి అమృతం!



భారతీయ వంటగదిలో మెంతులకు ప్రత్యేక స్థానం ఉంది. అయితే వీటిని ఒక పద్ధతి ప్రకారం తీసుకుంటే అది ఖరీదైన మందుల కంటే బాగా పనిచేస్తుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా మధుమేహం ఉన్నవారిలో రక్తంలోని చక్కెర స్థాయిలను నియంత్రించడానికి ఇది అద్భుతంగా పనిచేస్తుందని అంటున్నారు. మన వంటింట్లో సులభంగా దొరికే మెంతులలో అద్భుతమైన ఆరోగ్య రహస్యాలు దాగి ఉన్నాయి.

మెంతులు కేవలం పోపు దినుసులే కాకుండా, ఆయుర్వేదంలో గొప్ప ఔషధంగా పరిగణించబడతాయి. మెంతులను నేరుగా తీసుకోవడం కంటే, నానబెట్టి తీసుకోవడం వల్ల వాటిలోని పోషకాలు శరీరానికి మరింత సమర్థవంతంగా అందుతాయని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. మెంతులలో ఉండే గెలాక్టోమన్నన్ అనే మూలకం రక్తంలో చక్కెర శోషణను తగ్గిస్తుంది. ఇది ఇన్సులిన్ ఉత్పత్తిని పెంచి మధుమేహ వ్యాధిగ్రస్తులకు మేలు చేస్తుంది. మెంతులలో పీచు పదార్థం అధికంగా ఉంటుంది. నానబెట్టిన మెంతులు తీసుకోవడం వల్ల మలబద్ధకం, ఎసిడిటీ వంటి సమస్యలు తగ్గి జీర్ణక్రియ సాఫీగా సాగుతుంది. ఉదయాన్నే మెంతులు తీసుకోవడం వల్ల కడుపు నిండినట్లు అనిపిస్తుంది. దీనివల్ల అతిగా తినడం తగ్గి, బరువు తగ్గడానికి దోహదపడుతుంది. మెంతులలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ముఖంపై ముడతలను తగ్గిస్తాయి. జుట్టు రాలడం తగ్గి, కుదుళ్లు బలంగా మారడానికి ఇవి సహాయపడతాయి. శరీరంలోని ఎల్‌డీఎల్ లేదా చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో మెంతులు కీలక పాత్ర పోషిస్తాయి, తద్వారా గుండె జబ్బుల ముప్పు తగ్గుతుంది. ఎలా తీసుకోవాలి?: ఒక స్పూన్ మెంతులను రాత్రిపూట ఒక గ్లాసు నీటిలో నానబెట్టాలి. మరుసటి రోజు ఉదయం పరగడుపున ఆ నీటిని తాగి, నానబెట్టిన మెంతులను నమిలి తినాలి. మెంతులు ఆరోగ్యానికి ఎంతో మేలు చేసినప్పటికీ, గర్భిణీ స్త్రీలు లేదా ఏదైనా దీర్ఘకాలిక వ్యాధుల కోసం మందులు వాడుతున్న వారు వైద్యుని సలహా మేరకు మాత్రమే వీటిని తీసుకోవడం మంచిది. సహజమైన పద్ధతిలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి మెంతులు ఒక చౌకైన, శక్తివంతమైన మార్గం.

జామ ఆకులతో డయాబెటీస్‌కు చెక్!



పంటి నొప్పి, చిగుళ్ల వాపు, నోటి దుర్వాసన.. ఈ సమస్యలకు ఖరీదైన మౌత్ వాష్‌లే పరిష్కారం అనుకుంటున్నారా..? అయితే మీరు పొరబడినట్లే.. మన పెరట్లోనే దొరికే జామ ఆకులతో వీటన్నింటికీ చెక్ పెట్టవచ్చు. కేవలం నోటి ఆరోగ్యమే కాదు, డయాబెటిస్ నుంచి చర్మ సౌందర్యం వరకు జామ ఆకులు చేసే మేలు అంతా ఇంతా కాదు. మన పెరట్లో కనిపించే జామ చెట్టు కేవలం రుచికరమైన పండ్లనే కాదు, అమూల్యమైన ఔషధ గుణాలున్న ఆకులను కూడా అందిస్తుంది. ఖరీదైన మందులు, మౌత్ వాష్‌లకు బదులుగా రోజుకు రెండు జామ ఆకులను నమలడం వల్ల నోటి ఆరోగ్యం నుండి డయాబెటిస్ నియంత్రణ వరకు ఎన్నో లాభాలు ఉన్నాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. నోటి దుర్వాసన, చిగుళ్ల వాపు, పంటి నొప్పితో బాధపడేవారికి జామ ఆకులు ఒక వరం. వీటిలోని యాంటీ బాక్టీరియల్ గుణాలు నోటిలోని బ్యాక్టీరియాను చంపేస్తాయి. చిగుళ్ల నుండి రక్తం కారడం, వాపు ఉన్నప్పుడు లేత జామ ఆకులను నమలడం వల్ల తక్షణ ఉపశమనం లభిస్తుంది. జామ ఆకులను నమలడం వల్ల వచ్చే రసం మీ జీర్ణవ్యవస్థను శుద్ధి చేస్తుంది. ఇది గ్యాస్, ఎసిడిటీ, మలబద్ధకం వంటి సమస్యలను తగ్గించడమే కాకుండా, శరీరంలోని హానికరమైన వ్యర్థాలను బయటకు పంపుతుంది. శాస్త్రీయ పరిశోధనల ప్రకారం.. జామ ఆకుల సారం రక్తంలో చక్కెర స్థాయిలు అకస్మాత్తుగా పెరగకుండా నిరోధిస్తుంది. ముఖ్యంగా భోజనం తర్వాత గ్లూకోజ్ స్థాయిలను అదుపులో ఉంచడానికి ఇది సహాయపడుతుంది. కొవ్వు నిరోధకం: కార్బోహైడ్రేట్లు చక్కెరగా మారి శరీరంలో కొవ్వుగా పేరుకుపోకుండా జామ ఆకులు అడ్డుకుంటాయి. ఇది బరువు తగ్గాలనుకునే వారికి గొప్ప చిట్కా. వీటిలోని విటమిన్-సి, యాంటీఆక్సిడెంట్లు చర్మంపై ముడతలను తగ్గించి, సహజమైన మెరుపును అందిస్తాయి. రోజుకు 2 నుండి 3 లేత జామ ఆకులను శుభ్రంగా కడిగి నమలడం సరిపోతుంది. అయితే గర్భిణీ స్త్రీలు లేదా ఇతర తీవ్రమైన అనారోగ్య సమస్యలకు మందులు వాడుతున్న వారు, వీటిని వాడే ముందు ఖచ్చితంగా వైద్యుడిని సంప్రదించాలి. అతి తక్కువ ఖర్చుతో, సహజసిద్ధంగా మీ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి రోజువారీ అలవాట్లలో జామ ఆకులను చేర్చుకోవడం ఒక ఉత్తమ మార్గం.

అరటిపండు, నారింజ: ఏది తింటే ఆరోగ్యానికి మంచిది..?



చాలామంది ఉదయం నిద్రలేవగానే తక్షణ శక్తి కోసం ఏదో ఒక పండు తింటుంటారు. అయితే అల్పాహారంలో అరటిపండు తీసుకోవాలా లేక నారింజ పండు తీసుకోవాలా అనే సందేహం చాలామందిలో ఉంటుంది. ఈ రెండు పండ్లు ఆరోగ్యానికి మేలు చేసినప్పటికీ, వీటిని ఎప్పుడు, ఎలా తినాలో తెలిస్తేనే పూర్తి ప్రయోజనాలు అందుతాయి. తక్షణ శక్తికి అరటిపండు: అరటిపండులో కార్బోహైడ్రేట్లు, సహజ చక్కెరలు పుష్కలంగా ఉంటాయి.

ఇవి శరీరానికి తక్షణమే గ్లూకోజ్‌ను అందించి, రోజంతా ఉత్సాహంగా ఉండటానికి సహాయపడతాయి. ఇందులో ఉండే పొటాషియం రక్తపోటును నియంత్రించడంలో, గుండెను ఆరోగ్యంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. జీర్ణక్రియ: అరటిపండులోని ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఖాళీ కడుపుతో కేవలం అరటిపండును మాత్రమే తింటే కొంతమందిలో కడుపు ఉబ్బరం రావచ్చు. అందుకే వీటిని నట్స్ లేదా ఇతర ఆహారాలతో కలిపి తీసుకోవడం ఉత్తమం.

బ్లాక్ కాఫీతో కేలరీలు మంచులా కరిగిపోవాలా?





నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యత పెరిగింది. బరువు తగ్గడం కోసం డైట్ చేసేవారు, జిమ్‌కు వెళ్లేవారు ఎక్కువగా 'గ్రీన్ టీ' లేదా 'బ్లాక్ కాఫీ'ని ఆశ్రయిస్తుంటారు.

ఈ రెండూ కూడా తక్కువ కేలరీలు కలిగి ఉండి, శరీరంలోని జీవక్రియలను వేగవంతం చేస్తాయి. గ్రీన్ టీలోని యాంటీఆక్సిడెంట్లు ఆరోగ్యానికి రక్షణగా నిలిస్తే, బ్లాక్ కాఫీలోని కెఫీన్ తక్షణ శక్తిని అందిస్తుంది. ఒకటి పొట్ట చుట్టూ ఉన్న కొవ్వును నిదానంగా కరిగిస్తే, మరొకటి వ్యాయామం చేసే సమయంలో మీ శారీరక సామర్థ్యాన్ని పెంచుతుంది. ముఖ్య పదార్థం: ఇందులో ఇజిఅజి అనే శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్ ఉంటుంది. ఇది వ్యాయామం చేసేటప్పుడు కొవ్వు కణాలను విచ్ఛిన్నం చేయడానికి సహాయపడుతుంది. కెఫీన్: ఇందులో కెఫీన్ తక్కువగా ఉండటం వల్ల గుండెపై ఒత్తిడి పడదు. ఎసిడిటీ సమస్య ఉన్నవారికి ఇది ఉత్తమ ఎంపిక. ప్రయోజనం: ఇది నిదానంగా కానీ, దీర్ఘకాలికంగా బరువు తగ్గడానికి మరియు రక్తంలో చక్కెర స్థాయిలను స్థిరంగా ఉంచడానికి తోడ్పడుతుంది.

2. బ్లాక్ కాఫీ: ముఖ్య పదార్థం: ఇందులో కెఫీన్ అధికంగా ఉంటుంది. ఇది కేంద్ర నాడీ వ్యవస్థను ప్రేరేపించి, మెటబాలిజంను 3-11% వరకు వేగవంతం చేస్తుంది. శక్తి ప్రదాత:

వ్యాయామానికి ముందు బ్లాక్ కాఫీ తాగడం వల్ల శక్తి స్థాయిలు పెరిగి, ఎక్కువ సేపు వర్కౌట్ చేసే సామర్థ్యం వస్తుంది.

బాలీవుడ్‌కి ఎంట్రీ ఇస్తున్న అడివి శేష్!



కంటెంట్‌కు ప్రాధాన్యం ఉన్న కథలను ఎంచుకుంటూ టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపును దక్కించుకున్న హీరో అడివి శేష్. ఇటీవల 'డెకాయిట్' చిత్రంలో ప్రేక్షకులను అలరించారు. ప్రస్తుతం 'గూఢచారి-2' మూవీ పనుల్లో ఫుల్ బిజీగా గడుపుతున్నారు. ఈ చిత్రం ఘన విజయం సాధించిన 'గూఢచారి'కి సీక్వెల్‌గా రాబోతుండటం విశేషం. వినయ్ కుమార్ సిరిగినీడి దర్శకత్వంలో రాబోతున్న ఈ పాన్ ఇండియా చిత్రంలో అడివి శేష్ సరసన వామికా గబ్బి హీరోయిన్‌గా నటిస్తుండగా.. ఇమ్రాన్ హష్మీ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఇదిలా ఉంటే.. తాజాగా, అడివి శేష్‌కు సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అందుతున్న సమాచారం ప్రకారం.. అడివి శేష్ తెలుగులోనే కాకుండా హిందీ సినిమా ఇండస్ట్రీలో కూడా తన అదృష్టాన్ని పరీక్షించుబోతున్నారట. ఇందులో భాగంగానే ఆయన ఒక భారీ యాక్షన్ డ్రామా సినిమా చేయడానికి ఒప్పుకున్నట్లు టాక్.

ప్రస్తుతం ఈ భారీ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు అత్యంత వేగంగా సాగుతున్నట్లు తెలుస్తోంది. ఈ యాక్షన్ డ్రామా అక్టోబర్ నెలలోనే సెట్స్‌పైకి వెళ్లనుందని టాక్. దీనిపై ఇంకా అధికారికంగా ప్రకటన రానప్పటికీ, సినిమాకు సంబంధించిన చర్చలు గట్టిగా జరుగుతున్నాయని సమాచారం. అయితే ఈ సినిమా టైటిల్, దీనిని తెరకెక్కించబోయే దర్శకుడి పేరు, అలాగే నిర్మాణ సంస్థ వంటి విషయాలను చిత్ర యూనిట్ చాలా సీక్రెట్‌గా ఉంచింది. త్వరలోనే ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటనను భారీ ఎత్తున విడుదల చేసేందుకు మూవీ మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది.

థ్రిల్ చేసే 'మిస్సింగ్ మేఘన'



ఫస్ట్ కాపి మూవీస్, కేడిఒకో బ్యానర్ పై నిర్మాత పంచుమర్తి నరేష్ బాబు నిర్మిస్తున్న సినిమా 'మిస్సింగ్ మేఘన'. వాచస్పతి దర్శకుడు. రామ్ కార్తీక్, అమ్ము అభిరామి, వైదిక సెంజాలియా, అంకిత్ కొయ్య ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాకి సంబంధించిన ఫస్ట్ లుక్, టైటిల్ రివీలింగ్ పోస్టర్ లాంచ్ డైరెక్టర్ వి.వి.వినాయక్ చేతుల మీదుగా జరిగింది. ఈ కార్యక్రమంలో మూవీ టీం తో పాటు నిర్మాత బెక్కం వేణుగోపాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ వి.వి.వినాయక్ మాట్లాడుతూ, 'ఈ సినిమాతో హీరో రామ్ కార్తీక్, దర్శకుడు వాచస్పతికి మంచి పేరు రావాలి. అలాగే ధృవన్ మ్యూజికల్ ఆల్ రౌండర్. పాటలు రాస్తాడు, మ్యూజిక్ చేస్తాడు. అతడికి ఈ సినిమాతో మంచి పేరు రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను' అని అన్నారు. 'వి.వి.వినాయక్ ది గోల్డెన్ హ్యాండ్. ఆయన మా సినిమా టైటిల్ రివీలింగ్ పోస్టర్ లాంచ్ చేయడం చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమా ఒక సస్పెన్స్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్. ప్రేక్షకులు నచ్చే అన్ని అంశాలు ఈ సినిమాలో ఉంటాయి. అతి త్వరలో ప్రేక్షకుల ముందుకు ఈ సినిమాని తీసుకొస్తున్నాం. ప్రేక్షకులు ఈ సినిమాని ఆదరించి. సపోర్ట్ చేస్తారని కోరుకుంటున్నాను' అని దర్శకుడు వాచస్పతి చెప్పారు. హీరో రామ్ కార్తీక్ మాట్లాడుతూ,'ఈ సినిమాలో అవకాశం ఇచ్చినందుకు వాచస్పతి, ప్రొడ్యూసర్ నరేష్కి ధన్యవాదాలు.

అలా చేయడం వల్ల బతికిపోయాం



టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు ప్రస్తుతం 'వారణాసి' షూటింగ్‌లో ఫుల్ బిజీ అయిపోయారు. ఇందులో మహేష్ సరసన ప్రియాంక చోప్రా హీరోయిన్‌గా నటిస్తుండగా.. పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలో కనిపించనున్నారు. రాజమౌళి దర్శకత్వంలో రాబోతున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ మూవీ వచ్చే ఏడాది థియేటర్స్‌లోకి రాబోతోంది. మహేష్ బాబు షూటింగ్స్ నుంచి కొంచెం ఖాళీ సమయం దొరికినా సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండటంతో పాటు, కుటుంబంతో కలిసి సరదాగా గడపడానికి ఇష్టపడతారు. ఇదిలా ఉంటే, తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న మహేష్ బాబు మరదలు, మాజీ నటి శిల్పా శిరోద్కర్ తన బావ గురించి ఒక భలే ఆసక్తికరమైన, సరదా విషయాన్ని పంచుకున్నారు. మహేష్ బాబు, నమ్రతలకు పెళ్లయిన కొత్తలో జరిగిన ఒక సంఘటనను శిల్పా గుర్తుచేసుకున్నారు. ఆ సమయంలో మహేష్ బాబుకు మరాఠీ భాష అస్సలు రాదని తామంతా గట్టిగా నమ్మామన్నారు. దీంతో ఇంట్లో కుటుంబానికి సంబంధించిన ఏవైనా వ్యక్తిగత విషయాలు, సీక్రెట్స్ మాట్లాడుకోవాల్సి వచ్చినప్పుడు.. మహేష్ ముందే తామంతా మరాఠీ భాషలో మాట్లాడుకునేవాళ్లమని చెప్పారు. శిల్పా శిరోద్కర్ మాట్లాడుతూ.. "ఆయనకు ఎలాగూ అర్థం కాదు కదా అనే ధీమాతో నేను, నమ్రత ఎన్నో వ్యక్తిగత విషయాలను ఆయన ముందే మరాఠీలో చర్చించుకునేవాళ్లం. మేము మాట్లాడుకుంటున్నంత సేపు మహేష్ ఏమీ తెలియనట్లు ఎంతో ప్రశాంతంగా, అమాయకంగా వింటూ కూర్చునేవారు. కానీ, కొన్ని సంవత్సరాల తర్వాత ఒకరోజు ఎప్పటిలాగే మేమిద్దరం మరాఠీలో మాట్లాడుకుంటుండగా.. మహేష్ బాబు ఒక్కసారిగా మమ్మల్ని ఆశ్చర్యపరుస్తూ అదే భాషలో స్పందించారు. దాంతో మేము ఒక్కసారిగా షాక్‌కు గురయ్యాం. అంతవరకు తనకు మరాఠీ వచ్చనే విషయాన్ని దాచిపెట్టి, మా సీక్రెట్స్ అన్నీ వింటూ మహేష్ మమ్మల్ని నమ్మించి మోసం చేశారు. అయితే అదృష్టవశాత్తూ మహేష్ బాబు గురించి ఎలాంటి నెగెటివ్ విషయాలు మేము మాట్లాడుకోలేదు. లేదంటే ఆ తర్వాత ఆయన మమ్మల్ని దారుణంగా ఆటపట్టించేవారు.. అలా చేయకుండా బతికిపోయాం" అని చెప్పుకొచ్చారు.

ధనుష్ చిత్రంలో బాలీవుడ్ స్టార్ బ్యూటీ..?



కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్, దర్శకుడు పీ.ఎస్. మిత్రన్ కాంబినేషన్‌లో ఓ భారీ పాన్ ఇండియా చిత్రం తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ప్రముఖ దర్శకుడు, నిర్మాత సంజయ్ లీలా భన్సాలీ ఈ చిత్రాన్ని నిర్మించనుండటంతో సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి.

ఇక తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఓ క్రేజీ వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. తాజా సమాచారం ప్రకారం, ఈ చిత్రంలో ధనుష్‌కు జోడీగా నటించేందుకు బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కరీనా కపూర్ ఖాన్‌తో చిత్ర బృందం చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది.

భారీ బడ్జెట్‌తో మైథాలజికల్ జంగిల్ అడ్వెంచర్ ఎపిక్‌గా రూపొందనున్న ఈ చిత్రంలో కరీనా కీలక పాత్రలో కనిపించే అవకాశముందని నివేదికలు చెబుతున్నాయి. అయితే ఇప్పటివరకు ఆమె అధికారికంగా ఒప్పందంపై సంతకం చేయలేదని, ప్రస్తుతం చర్చలు కొనసాగుతున్నాయని సమాచారం. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే తొలిసారిగా ధనుష్-కరీనా కపూర్ జంట వెండితెరపై సందడి చేయనుంది.



Edited, Printed, Published & Owned by PUSALA SRINIVAS, Printed at D.K. Publications,2-3-691/1/A CPL Main Road, Amberpet, Hyderabad and Published # Do.No. 2-2-1075/20/E/1, Opp. Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13. Editor : PUSALA SRINIVAS, RNI. NO. APTEL/2008/26737. Cell: 9603754136, 9949653944 E-mail: dkchaatimpu80@gmail.com